ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -111 పేజీలు - 08 వెల - 04/- బుధవారం 5 ఫిబ్రవరి 2025

## అక్రమ వలసదారులపై
# ఉక్కుపాదం

**వెతికి పట్టుకుని మరీ దేశందాటిస్తున్న ట్రంప్**


**మిలిటరీ విమానంలో పలువురు భారతీయుల తరలింపు**



వాషింగ్టన్ ఫిబ్రవరి 04ఆంధ్ర ప్రగతి
అమెరికాలో అధికారం చేపట్టిన తర్వాత, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అక్రమ వలసదారులను దేశం నుండి బహిష్కరించడానికి కఠినమైన చర్యలు తీసుకుంటున్నారు. నిన్న మొన్నటి వరకు కెనడా, మెక్సికో, కొలంబియా, బ్రెజిల్ దేశాలకు చెందిన వారిని గెంటేసిన ట్రంప్.. తాజాగా భారత్ వంతు వచ్చేసింది. అమెరికాలో నివసిస్తున్న అక్రమ భారతీయ వలసదారులను స్వదేశానికి తిప్పి పంపిస్తున్నారు.

మిగతాది 2లో...

## పేదరిక నిర్మూలనే
# ఎన్డీయే లక్ష్యం



**రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ లో ప్రధాని మోదీ**

**గతంలో ఢిల్లీ నుంచి రూపాయి పంపితే గ్రామాలకు 16 పైసలు చేరేవిరాష్ట్రపతి ప్రసంగం ఆత్మవిశ్వాసం నింపిందీ**

**గత ప్రభుత్వాలపై విమర్శనాస్త్రాలు**

న్యూఢిల్లీ,ఫిబ్రవరి 04ఆంధ్ర ప్రగతి
రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై లోక్ సభలో చర్చ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడారు. నా ప్రభుత్వాన్ని మూడోసారి కూడా ఎన్నుకున్నందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానంటూ మోదీ తన ప్రసంగం ప్రారంభించారు. రాష్ట్రపతి ప్రసంగం తమలో ఆత్మవిశ్వాసం నింపిందని అన్నారు. పేదరిక నిర్మూలనే తమ ప్రధాన ధ్యేయమనిచెప్పారు. వికసిత్ భారత్ సాధనే ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యమని, ఈ క్రమంలో మధ్య తరగతి ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాల్సి ఉందని మోదీ అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా గత యూపీఏ పాలనపై విమర్శనాస్త్రాలు సంధించారు. "గత ప్రభుత్వాలు గరీబీ హఠావో అంటూ నినాదాలు మాత్రమే ఇచ్చాయి. మేం గత పదేళ్ల కాలంలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటికి తీసుకువచ్చాం.

మిగతా 2లో

## మూడు శాసనసభా కమిటీలకు ఛైర్మన్ల నియామకం

**ఉత్తర్వులు జారీచేసిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు**

అమరావతి,ఫిబ్రవరి 04ఆంధ్ర ప్రగతి
ఏపీ శాసన వ్యవస్థలో ఫైనాన్షియల్ కమిటీలను నియమిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ, అంచనాల కమిటీల ఛైర్మన్‌లను అధికారికంగా ప్రకటిస్తూ నోటిఫికేషన్ ఇచ్చారు. ప్రజాపద్దుల సంఘం ఛైర్మన్‌గా పులవర్తి రామాంజనేయులు, పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్స్ కమిటీ ఛైర్మన్‌గా కూన రవికుమార్, అంచనాల కమిటీ ఛైర్మన్‌గా వేగుళ్ల జోగేశ్వరరావు నియామకాన్ని ఆమోదిస్తున్నట్టు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.




పులవర్తి రామాంజనేయులు



కూన రవికుమార్,



వేగుళ్ల జోగేశ్వరరావు



## పని గంటలను పెంచే
# ప్రతిపాదన లేదు

**పనిగంటల అంశంపై కేంద్రం స్పందన**

**ఉద్యోగుల పని గంటల పెంపుపై పలువురు కార్పొరేట్ దిగ్గజాల వ్యాఖ్యలు**

**లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చిన కార్మిక, ఉపాధి కల్పన సహాయ మంత్రి శోభా కరంద్లాజే**

2లో

## ఎపిలో కులగణన సర్వేచేపట్టండి

**సర్వేతో తెలంగాణ ఆదర్శంగా నిలిచింది**

**కూటమి సర్కార్‌కు షర్మిల డిమాండ్**



విజయవాడ,ఫిబ్రవరి 04ఆంధ్ర ప్రగతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కులగణన సర్వే చేపట్టాలని కూటమి ప్రభుత్వాన్ని పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. తెలంగాణ తరహాలో నిర్ణయం తీసుకోవాలన్నారు. ఐదున్నర కోట్ల రాష్ట్ర జనాభాలో వెనుకబడిన వర్గాల వారి సంఖ్య ఎంతో తేల్చాలంటూ ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఆమె సూచించారుమిగతా2లో...

## కులగణన, ఎస్సీ వర్గీకరణ నివేదికలకు
# తెలంగాణ కేబినెట్ ఆమోదం

**రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ భేటీ**

**అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదం తెలుపనున్న సభ**

**కులగణన, ఎస్సీ వర్గీకరణకు తెలంగాణ నుంచి రోడ్ మ్యాప్ ఇస్తున్నామన్న రేవంత్ రెడ్డి**



ఫిబ్రవరి 04ఆంధ్ర ప్రగతి :సమగ్ర కులగణన, ఎస్సీ వర్గీకరణ నివేదికలకు తెలంగాణ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన అసెంబ్లీ హాలులో సుమారు రెండు గంటల పాటు కేబినెట్ సమావేశం జరిగింది. మంత్రివర్గం ఆమోదం తెలిపిన నివేదికలను అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదం తెలుపనున్నారు. ఈ కేబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, దేశంలోనే మొదటిసారిగా కులగణన చేపట్టి తెలంగాణ రాష్ట్రం చరిత్ర సృష్టించిందని అన్నారు. పకడ్బందీగా సర్వే నిర్వహించి సమాచారం సేకరించామని తెలిపారు. మిగతాది 2లో...

## తిరుపతి డిప్యూటీ మేయర్
# టీడీపీ కైవసం

**తిరుపతి డిప్యూటీ స్పీకర్ గా మునికృష్ణ**

**26 ఓట్లతో మ్యాజిక్ ఫిగర్ అందుకున్న మునికృష్ణ**

**వైసీపీ అభ్యర్థి భాస్కర్ రెడ్డికి 21 ఓట్లు**



తిరుపతిఫిబ్రవరి 04ఆంధ్ర ప్రగతి
తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పదవిని టీడీపీ కైవసం చేసుకుంది. డిప్యూటీ మేయర్ గా అభ్యర్థి మునికృష్ణ ఎన్నికయ్యారు. మున్సిపల్ కార్పొరేషన్ లో మొత్తం 50 మంది కార్పొరేటర్లకు గాను ప్రస్తుతం 47 మంది ఉన్నారు. తిరుపతి వైసీపీ ఎంపీ గురుమూర్తి, జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉన్నారు. మొత్తం 50 మంది సభ్యులకు గాను మునికృష్ణకు 26 మంది ఓటు వేశారు. వైసీపీ అభ్యర్థి భాస్కర్ రెడ్డికి 21 మంది మద్దతుగా నిలిచారు. దీంతో మునికృష్ణ గెలిచినట్టు అధికారులు ప్రకటించారు.

మిగతా 2లో

## వైసీపీ కీలక నేతలతో జగన్ భేటీ



అమరావతిఫిబ్రవరి 04ఆంధ్ర ప్రగతి
తాడేపల్లిలోని వైసీపీ కార్యాలయంలో పార్టీ కీలక నేతలతో ఆ పార్టీ అధినేత జగన్ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో బొత్స సత్యనారాయణ, సజ్జల రామకృష్ణారెడ్డి, కురసాల కన్నబాబు, కారుమూరి నాగేశ్వరరావు, తోట త్రిమూర్తులు సహా పలువురు కీలక నేతలు హాజరయ్యారు. ఈ సమావేశంలో... పలు చోట్ల డిప్యూటీ మేయర్, మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలు జరుగుతున్న తీరుపై వీరు చర్చిస్తున్నట్టు సమాచారం. కార్యకర్తలతో జగనన్న కార్యక్రమంపై కూడా చర్చించే అవకాశం ఉంది. త్వరలో జరగనున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు హాజరయ్యే అంశంపై కూడా చర్చించనున్నట్టు తెలుస్తోంది.మిగతాది 2లో...

## ఇక ముందు కూడా
# ఇదే పంథా కొనసాగిద్దాం

**ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ఏపీ మంత్రి నారా లోకేశ్**

**ఢిల్లీలో లోకేశ్ ను కలిసిన కేంద్ర మంత్రులు రామ్మోహన్, పెమ్మసాని, శ్రీనివాసవర్మ**

**సమష్టి కృషితోనే రాష్ట్రానికి మేలు జరుగుతుందన్న లోకేశ్**

**కలిసికట్టుగా ఉండటం వల్లే విశాఖ స్టీల్ ను కాపాడుకోగలిగామని వెల్లడి**



అమరావతి,ఫిబ్రవరి 04ఆంధ్ర ప్రగతి
ఏపీ మంత్రి నారా లోకేశ్ ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సంగతి తెలిసిందే. ఢిల్లీలో కేంద్ర మంత్రులు శ్రీనివాస వర్మ, రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీ ఎంపీలు, బీజేపీ నేతలు మంత్రి లోకేశ్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ...మిగతాది 2లో...

# పేదరిక నిర్మూలనే ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

కొందరు నేతలు బంగ్లాలు కట్టుకోవడంపై దృష్టి సారించారు. మేం ప్రతి ఇంటికీ మంచి నీరు అందించడంపై దృష్టి సారించాం. దేశంలో పేదల కోసం 12 కోట్లకు పైగా మరుగుదొడ్లు కట్టించాం. కొందరు నేతలు కేవలం పేదలతో ఫొటోలు దిగేందుకే ఉత్సాహం చూపిస్తుంటారు... పార్లమెంటులో పేదల గురించి మాట్లాడుతుంటే అదే నేతలు విసుగ్గా ముఖం పెడతారు. అప్పట్లో ఢిల్లీ నుంచి రూపాయి పంపితే గ్రామాలకు 16 పైసలే చేరుతున్నాయని ఓ ప్రధాని వాపోయారు. గతంలో ఢిల్లీ నుంచి గల్లీ వరకు ఒకే ప్రభుత్వం ఉన్నప్పటికీ అదే పరిస్థితి! కానీ ఇప్పుడు ఢిల్లీ నుంచి రూపాయి పంపితే గ్రామానికి రూపాయి చేరుతోంది. నగదు బదిలీ (డీబీటీ) ద్వారా నేరుగా ప్రజలకే సొమ్ము చేరుతోంది. ప్రజల సొమ్ము ప్రజల చేతికే అనేది మా నినాదం. డిజిటల్ టెక్నాలజీ ద్వారా పారదర్శకత పెంచాం. 10 కోట్ల నకిలీ బ్యాంకు ఖాతాలను గుర్తించి తొలగించాం. చమురులో ఇథనాల్ బ్లెండింగ్ ద్వారా విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేశాం. గతంలో లక్షల కోట్ల అవినీతి అంటూ రోజూ వార్తలు వచ్చేవి. గత పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు లేవు. కొందరు శీష్ మహల్ నిర్మాణం కోసం అవినీతికి పాల్పడతారు. ఎన్డీయే ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనపై భారీగా వెచ్చించింది. కేంద్రంలో పదేళ్లుగా అవినీతి లేకపోవడం వల్ల ప్రజలు లాభపడ్డారు. ఆయుష్మాన్ భారత్, జన ఔషధి కేంద్రాల ఏర్పాటు వల్ల రోగులకు ఎంతో మేలు జరిగింది. ప్రజలకు రూ.12 లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపు ఇచ్చాం. మేం అధికారంలోకి రాకముందు ఎల్ఈడీ బల్బు ధర రూ.400 ఉండేది... మేం వచ్చాక ఎల్ఈడీ బల్బును రూ.40కే పంపిణీ చేశాం. ఎల్ఈడీ బల్బులను ప్రభుత్వం పంపిణీ చేయడం ద్వారా ప్రజలకు రూ.20 వేల కోట్లు ఆదా అయ్యాయి. గతంలో న్యూస్ పేపర్లు చూస్తే అవినీతి వార్తలు ఉండేవి... మా హయంలో ప్రతి రూపాయిని ప్రజల కోసమే ఖర్చు చేస్తున్నాం. ప్రజల డబ్బును మేం అద్దాల మేడలు నిర్మించడానికి ఉపయోగించడంలేదు. ప్రజల డబ్బును దేశాభివృద్ధికి వినియోగిస్తున్నాం. వరల్డ్ గేమింగ్ క్యాపిటల్ గా భారత్ రూపుదిద్దుకుంటోంది. మా పాలన బాగుండడం వల్లే మళ్లీ మళ్లీ గెలుస్తున్నాం. హర్యానాలో మూడోసారి అధికారంలోకి వచ్చాం... మహారాష్ట్రలోనూ అధికారం నిలబెట్టుకున్నాం" అని మోదీ వివరించారు.

# ఏపిలో కులగణన సర్వే చేపట్టండి

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం విజయవాడలో షర్మిల విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఐదున్నర కోట్ల జనాభాలో వెనుకబడిన వర్గాల వారి సంఖ్య ఎంతో తేల్చాలన్నారు. అలాగే కుల వివక్షకు గురవుతున్న
బలహీన వర్గాల ప్రజలు ఎంత మంది ఉన్నారో లెక్కలు తీయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మనమెంతో మనకంతా అన్నట్లుగా.. రాజకీయ, సామాజిక, విద్యా, ఉద్యోగాలలో వారి వాటా వారికి దక్కాల్సి ఉందని పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల అభిప్రాయపడ్డారు. జనాభా ప్రాతిపదికన న్యాయంగా రిజర్వేషన్లు అమలు కావాల్సి ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు కులగణన చేపట్టినా.. బీజేపీ దత్తపుత్రుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్.. ఆ సర్వే వివరాలు తొక్కిపెట్టారని వైఎస్ షర్మిల వ్యంగ్యంగా అన్నారు. ఆ వివరాలు బయటకు రాకుండా జాగ్రత్త పడ్డారంటూ మాజీ సీఎం వైఎస్ జగన్‌పై మండిపడ్డారు. బీజేపీ డైరెక్షన్‌లోనే సర్వే రిపోర్టు బయటకు పొక్కకుండా కుట్ర చేశారంటూ వైఎస్ జగన్‌పై నిప్పులు చెరిగారు. ఇక ఓ వైపు దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేస్తుంటే.. రిజర్వేషన్ల రద్దుకు కుట్ర అంటూ బీజేపీ తప్పు దారి పట్టించే ప్రయత్నం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ఉచ్చులో మీరు పడవద్దంటూ సీఎం చంద్రబాబుకు ఈ సందర్భంగా వైఎస్ షర్మిల సూచించారు. వెంటనే ఏపీలో సైతం కులగణన సర్వే చేపట్టాలని.. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి సూచించారు. మరోవైపు తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన దేశానికే ఆదర్శమని ఈ సందర్భంగా వైఎస్ షర్మిల అభివర్ణించారు. ఇదో చారిత్రాత్మక ఘట్టమన్నారు. ఈ సర్వే యావత్ భారతావనికి దిక్సూచి అని తెలిపారు. దేశ భవిష్యత్ కోసం రాహుల్ గాంధీ దూరదృష్టికి ఇదొక నిదర్శనమన్నారు. తెలంగాణ రాష్ట్ర జనాభాలో 56 శాతం బీసీలు, 17 శాతం ఎస్సీలు, 10 శాతం ఎస్టీలు ఉన్నారని.. అంటే దాదాపు 90 శాతం వెనుకబడిన, బలహీన వర్గాల ప్రజలే ఉండటం విస్మయపరిచిన అంశమని ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సైతం ఇదే పరిస్థితి ఉంటుందని తాము నమ్ముతున్నామని ఈ సందర్భంగా వైఎస్ షర్మిల పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరిలో తెలంగాణ వ్యాప్తంగా కుల గణన సర్వే చేపట్టారు. ఆ సర్వే వివరాలను ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌లో సైతం కుల గణన సర్వే నిర్వహించాలని చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వాన్ని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు.

# తిరుపతి డిప్యూటీ మేయర్ టీడీపీ కైవసం

తిరుపతి డిప్యూటీ మేయర్‌గా ఆర్సీ మునికృష్ణ ఎన్నికయ్యారు. తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా 26.. వైఎస్సార్‌సీపీకి 21 ఓట్లు పోలయ్యాయి. ఈ సందర్భంగా తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాస్ మాట్లాడుతూ డిప్యూటీ మేయర్ ఎన్నికలో కూటమి విజయం సాధిస్తుందని నిన్ననే చెప్పామని అనుకున్నది సాధించామని అన్నారు. నిన్న తమ కార్పొరేటర్లు నలుగురిని వైఎస్సార్‌సీపీ నేతలు అడ్డుకుని, కిడ్నాప్ చేశారని.. కిడ్నాప్ అయిన వారందరూ తిరిగి వచ్చేశారని తెలిపారు. మంగళవారం జరిగిన ఎన్నికల్లో ఎన్డీయే కూటమి 26 ఓట్లతో విజయం సాధించిందన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు అడ్డదారిన గెలవాలని చూశారని.. దానిని తిప్పి కొట్టామని ఆరణి శ్రీనివాస్ చెప్పారు. శ్రీవారి ఆశీస్సులతో ఎన్డీయే కూటమి అభ్యర్థి మునికృష్ణ ఎన్నిక లాంఛనంగా గెలుపొందారని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం మునికృష్ణ మాట్లాడుతూ.. 26 మంది సభ్యులు తనకు ఓట్లు వేసి డిప్యూటీ మేయర్‌గా ఎన్నుకున్నారని సంతోషం వ్యక్తం చేశారు. తనకు ఓట్లు వేసి గెలిపించిన కార్పొరేటర్లకు, అండగా నిలిచిన ఎమ్మెల్యేకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అలాగే స్థానిక మంత్రి, తనకు మద్దతు తెలిపిన ఇతర



నాయకులకు మునికృష్ణ ధన్యవాదాలు తెలిపారు. తిరుపతి అభివృద్ధికి కృషి చేస్తామని, కూటమి నేతలను కలుపుకుని తిరుపతిలో ఎక్కడా ఏ ఇబ్బంది లేకుండా అభివృద్ధి చేస్తామని చెప్పారు. కాగా తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నిక ఎంతో ఉత్కంఠభరితంగా జరిగింది. సోమవారం జరగాల్సిన ఎన్నిక వాయిదా పడింది. అలాగే మంగళవారం కూడా ఏం జరుగుతుందో అన్న ఉత్కంఠ నెలకొంది. ప్రశాంతంగానే ఓటింగ్ జరిగింది. చివరికి కూటమి అభ్యర్థి గెలుపుతో కథ సుఖాంతమైంది. 47 మంది కార్పొరేటర్లు, ముగ్గురు ఎక్స్ ఆఫిషియో నెంబర్లు.. మొత్తం 50 మంది. అయితే ఓటింగ్‌లో 48 మంది పాల్గొన్నారు. ఇద్దరు అనారోగ్యంతో రాలేకపోయారు. దీంతో ఓటింగ్ నిర్వహించిన ఎన్నికల అధికారి ముందు వైఎస్సార్‌సీపీ వాళ్లు చేతులెత్తాలని కోరగా 21 మంది చేతులెత్తారు. తర్వాత కూటమి నేతలు 26 మంది చేతులెత్తారు. దీంతో కూటమి అభ్యర్థి మునికృష్ణ డిప్యూటీ మేయర్‌గా గెలుపొందినట్లు అధికారి ప్రకటించారు. కాగా డిప్యూటీ మేయర్ ఎన్నిక సోమవారం జరగాల్సి ఉంది. కోరం లేక ఎన్నికను అధికారులు వాయిదా వేశారు. ఆదివారం రాత్రి నుంచి తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నికపై హై డ్రామా కొనసాగింది. ఆదివారం రాత్రి టీడీపీ శిబిరంపై వైఎస్సార్‌సీపీ నేతలు దౌర్జన్యానికి దిగారు. కార్పొరేటర్‌ను వైఎస్సార్‌సీపీ నేత భూమన లాక్కెళ్లినట్లు టీడీపీ నేతలు ఆరోపించారు. కోరం 25 మంది ఉండాలి. అయితే 22 మంది మాత్రమే ఉన్నారు. దీంతో అధికారులు ఎన్నికల నిబంధనల మేరకు ఎన్నికను మంగళవారం నాటికి వాయిదా వేశారు. దీంతో మంగళవారం గట్టి బందోబస్తు మధ్య డిప్యూటీ మేయర్ ఎన్నిక నిర్వహించారు. మరోవైపు తిరుపతిలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు తిరుగుబాటు చేశారు. కొంతమంది కూటమిలో చేరారు. పాలనలో తమకు స్వేచ్ఛలేదని కూటమిలో చేరడంవల్ల తమకు గౌరవం పెరిగిందని కార్పొరేటర్లు అన్నారు.

# హిందూ ధర్మాలు, ఆలయాలు కాపాడటమే చంద్రబాబు లక్ష్యం

## మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

**అమరావతి ఫిబ్రవరి 04ఆంధ్ర ప్రగతి** హిందూ ధర్మాలు, ఆలయాలను కాపాడాలనేది సీఎం చంద్రబాబు నాయుడు ఆలోచన అని ఏపీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. హిందువులకు ఆరాధ్య దైవమైన శ్రీ సూర్యనారాయణ స్వామి పండుగే రథసప్తమి అని చెప్పారు. భూప్రపంచానికి సూర్యోదయంతోనే వెలుగులు నిండుతాయని అన్నారు. సీఎం చంద్రబాబు సూచనతో అరసవెల్లిలో జరిగే రథసప్తమి వేడుకలను, రాష్ట్రంలో జరిగే వేడుకలను ఈ ఏడాది రాష్ట్ర పండుగగా గుర్తించామని అన్నారు. అరసవెల్లిలో జరిగే వేడుకల్లో సీఎం చంద్రబాబు పట్టవస్త్రాలు సమర్పించాల్సి ఉందని... కానీ ఎన్నికల కోడ్ వల్ల అధికారులనే పట్టువస్త్రాలు



సమర్పించాల్సిందిగా ఆదేశాలిచ్చామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి గుర్తుచేశారు. నెల్లూరు మూలాపేట శివాలయంలోని సూర్యభగవానుడికు ప్రత్యేక పూజలు నిర్వహించామని అన్నారు. అనాధిగా తమ కుటుంబం రథసప్తమి పూజలు నిర్వహిస్తుందని వివరించారు. రాష్ట్రంలో పలు ఆలయాల పుననిర్మాణానికి నిధుల కేటాయింపులు జరుగుతున్నాయన్నారు. నెల్లూరు జిల్లాలో 18 ఆలయాల పున నిర్మాణాలకు రూ.38కోట్ల నిధులు విడుదలయ్యాయని ప్రకటించారు. మహాశివరాత్రి రోజున శ్రీశైలం, మహానంది, శ్రీకాళహస్తి, దాక్షారామంలో భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామన్నారు. మూలాపేట శివాలయం అభివృద్ధికి మంత్రి నారాయణతో కలిసి ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. ఏపీలో రాతికట్టడాలకు గత జగన్ ప్రభుత్వంలో రంగులు వేయడం వల్ల పవిత్రతను కోల్పోయాయని తెలిపారు. ఆ రంగులు తొలగించి, వాటిని కాపాడుతామన్నారు. చరిత్ర, పవిత్రతను భవిష్యత్తు తరాలకు అందిస్తామని చెప్పారు. అందుకు ఎన్ని నిధులైనా ఖర్చు చేస్తాం. భక్తులు తమ ప్రభుత్వానికి అండగా ఉన్నారని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు.

# స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం :కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 04ఆంధ్ర ప్రగతి** స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ వెల్లడించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పై పార్లమెంట్ వేదికగా కేంద్ర ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. స్టీల్ ప్లాంట్‌ను కాపాడాలనే ఉద్దేశంతోనే రూ.11,500 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించినట్లు లోక్‌సభ సాక్షిగా కేంద్ర మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా విశాఖ స్టీల్ ప్లాంట్ అంశంపై లోక్ సభలో బీజేపీ ఎంపీ సీఎం రమేశ్, జనసేన ఎంపీ బాలశౌరి ప్రశ్నలు లేవనెత్తారు. ఈ మేరకు కేంద్ర మంత్రి భూపతి రాజు క్లారిటీ ఇచ్చారు. ప్లాంట్‌ను కాపాడేందుకే రూ.11,500 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ఆమోదించినట్లు ఆయన స్పష్టం చేశారు. సంస్థని రక్షించుకోవాలనే ఆలోచనతోనే కేంద్రం వేల కోట్ల ప్రకటించి ముందడుగు వేసినట్లు చెప్పుకొచ్చారు. విశాఖ స్టీల్ ప్లాంట్ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని, మొత్తం అప్పులు, బకాయిలు, రుణాలు సహా రూ.38,965 కోట్ల నష్టాల్లో సంస్థ ఉందని కేంద్రమంత్రి భూపతిరాజు వెల్లడించారు. ఉద్యోగులకు జీతాలు చెల్లింపులోనూ సంస్థకు ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. 2024 సంవత్సరానికి సంబంధించి సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల్లో ఉద్యోగులకు కొద్దిమేర మాత్రమే వేతనాలు చెల్లించినట్లు ఆయన చెప్పారు. 2024 ఏప్రిల్, డిసెంబర్ మధ్య సంస్థ రూ.12,615 కోట్ల ఆదాయాన్ని ఆర్జించిందని, అయినా రూ.3,943 కోట్ల నష్టాన్ని చవిచూసిందని కేంద్రమంత్రి వెల్లడించారు. సంస్థ గురించి ఆందోళన చెంది, దాన్ని పరిరక్షించేందుకు ప్రత్యేక ప్యాకేజీతో చర్యలు చేపట్టినట్లు భూపతిరాజు చెప్పుకొచ్చారు.

# అక్రమ వలసదారులపై ఉక్కుపాదం

(మొదటి పేజీ తరువాయి)

అమెరికా మిలటరీకి చెందిన సి –17 ప్రత్యేక విమానం బయలుదేరింది. అమెరికన్ అధికారి ఒకరు ఈ సమాచారం ఇచ్చారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ఇమ్మిగ్రేషన్ ఎజెండాను నెరవేర్చడానికి సైన్యం సహాయం తీసుకుంటున్నారు. దీని కింద సైనిక విమానాల సహాయంతో ప్రజలను బహిష్కరించే పని ప్రారంభించారు. అమెరికాలో భారత్‌కు చెందిన దాదాపు 7లక్షల 25వేలకుపైగా మంది సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా ఉంటున్నట్లు సమాచారం. వీరిలో 18 వేల మందిని భారత్‌కు తరలించేందుకు జాబితా రూపొందించింది. ఈ విషయంలో భారత్ కూడా తమ స్పందనను తెలియజేసింది. అక్రమ వలసలకు తాము కూడా వ్యతిరేకమని స్పష్టం చేసింది. వీసా గడువు ముగిసినా సరైన పత్రాలు లేకుండా అమెరికా సహా ఎక్కడ ఉన్నా భారతీయులను వెనక్కి తీసుకొస్తామని తెలిపింది. కాగా, మెక్సికో, సాల్వెడార్ తర్వాత అమెరికాలో ఎక్కువగా ఉంటున్నది భారతీయులే అని లెక్కలు చెబుతున్నాయి. అమెరికా చరిత్రలోనే అతిపెద్ద బహిష్కరణ ఆపరేషన్ కొనసాగుతోంది. దేశంలో అక్రమంగా ఉంటున్న వారిని గుర్తిస్తున్న అధికారులు వారిని ఆయా దేశాలకు తరలిస్తున్నారు. అందులో భాగంగా భారత్‌కు ఓ విమానం బయలుదేరింది. సీ17 విమానంలో వీరిని తరలిస్తున్నారు. ట్రంప్ అధ్యక్షుడయ్యాక ఇప్పటివరకు 8వేల మంది వరకు అక్రమ వలసదారులను అరెస్ట్ చేసినట్లు సమాచారం. అక్రమ వలసదారులను ఆయా దేశాలకు తరలించేందుకు రంగం సిద్ధం చేశారు. అక్రమ వలసదారులను వెనక్కి పంపేందుకు ఒక్కో వ్యక్తిపై అమెరికా దాదాపు 4వేల 675 డాలర్లు ఖర్చు చేస్తోంది. ట్రంప్ ఆదేశాల మేరకు, అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దేశం నుండి బహిష్కరించాల్సిన 1.5 మిలియన్ల మంది వ్యక్తుల జాబితాను సిద్ధం చేసింది. డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా, భారతీయ అక్రమ వలసదారులను భారతదేశానికి తిప్పి పంపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌లతో జరిగిన చర్చల సందర్భంగా ట్రంప్, విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో అమెరికాలో నివసిస్తున్న అక్రమ భారతీయుల గురించి ఆందోళన వ్యక్తం చేశారు. ఏ దేశంలోనైనా చట్టవిరుద్ధంగా నివసించడాన్ని భారత్ వ్యతిరేకిస్తుందని అన్నారు. మన పౌరుల్లో ఎవరైనా అమెరికాలో చట్టవిరుద్ధంగా నివసిస్తున్నట్లయితే, వారు భారతీయ పౌరులు అయితే, స్వదేశానికి చట్టబద్ధంగా తిరిగి రావడానికి సిద్ధంగా ఉన్నామని కేంద్ర మంత్రి ఎస్ జైశంకర్ అన్నారు.

# సమగ్ర కులగణన, ఎస్సీ వర్గీకరణ నివేదికలకు తెలంగాణ కేబినెట్ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

కులగణన, ఎస్సీ వర్గీకరణ విషయాల్లో తెలంగాణ రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు మార్గనిర్దేశనం చేస్తుందని ఆయన అన్నారు.దీనితో, కులగణనపై ప్రధానమంత్రిపై ఒత్తిడి పెరుగుతుందని ఆయన అన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుతో పాటు మంత్రివర్గ ఉపసంఘం, ఏకసభ్య కమిషన్ సిఫార్సుల ప్రకారం ప్రభుత్వం ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్ సభకు రావడం లేదని విమర్శించారు. ప్రజా సమస్యలపై ప్రతిపక్షానికి చిత్తశుద్ధి లేదని ఆయన అన్నారు.

# పని గంటలను పెంచే ప్రతిపాదన లేదు

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగుల పని గంటల పెంపు అంశంపై పలువురు కార్పొరేట్ దిగ్గజాలు చేస్తున్న వ్యాఖ్యలు దేశ వ్యాప్తంగా హాట్ టాపిక్ అవుతున్న వేళ, కేంద్ర ప్రభుత్వం దీనిపై మరోసారి క్లారిటీ ఇచ్చింది. పని గంటలను వారానికి 70 లేదా 90 గంటలకు పెంచే ప్రతిపాదన ఏదీ తమ పరిశీలనలో లేదని స్పష్టం చేసింది. కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన సహాయ మంత్రి శోభా కరంద్లాజే ఈమేరకు లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. కార్మికుల అంశం ఉమ్మడి జాబితాలో ఉందని, ఆ చట్టాల అమలును రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రం వారి అధికార పరిధిలో నిర్వహిస్తాయని తెలిపారు.చట్టాల అమలు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో సెంట్రల్ ఇండస్ట్రియల్ రిలేషన్ మెషినరీ (సీఐఆర్ఎం) తనిఖీ అధికారులు చూడగా, రాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వాలు పర్యవేక్షిస్తాయని మంత్రి పేర్కొన్నారు.

# ఇక ముందు కూడా ఇదే పంథా కొనసాగిద్దాం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే సమష్టి కృషితో విశాఖ రైల్వే జోన్, అమరావతి, పోలవరం, స్టీల్ ప్లాంట్ కు నిధులు తెచ్చుకోగలిగామని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర మంత్రులు, ఎంపీలు చేస్తున్న కృషిని లోకేశ్ అభినందించారు. అతి తక్కువ కాలంలో విశాఖ స్టీల్ తో సహా అనేక సమస్యల పరిష్కారం కావడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని లోకేశ్ అన్నారు. కలిసికట్టుగా ఉండటం వల్లే విశాఖ స్టీల్ ను కాపాడుకోగలిగాం, రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఇక ముందు కూడా ఇదే పంథా కొనసాగిద్దామని పిలుపునిచ్చారు.

# కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు సన్నాహాలు వ్యతిరేకిస్తూ హైకోర్టులో పిల్ దాఖలు

**అమరావతిఫిబ్రవరి 04ఆంధ్ర ప్రగతి** ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. అలాంటి వేళ కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడాన్ని సవాల్ చేస్తూ ఏపీ హైకోర్టులో మంగళవారం ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు అయింది. ఈ వ్యాజ్యాన్ని న్యాయవాదులు తాండవ యోగేష్‌తోపాటు తురగా సాయి సూర్య దాఖలు చేశారు. ఈ పిల్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శితోపాటు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను ప్రతివాదులుగా న్యాయవాదులు చేర్చారు. జస్వంత్ సింగ్ కమిషన్ నివేదికను పరిశీలనలోకి తీసుకోకుండా ఈ హైకోర్టు బెంచ్‌ను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందంటూ సదరు పిల్‌లో న్యాయవాదులు పేర్కొన్నారు. అదే విధంగా భావోద్వేగాలు, రాజకీయ అంశాలను పరిశీలనలోకి తీసుకుని హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయడం న్యాయ, రాజ్యాంగ విరుద్దమంటూ వారు ఈ పిటిషన్‌లో స్పష్టం చేశారు. అదికాక.. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 31కు ప్రభుత్వ నిర్ణయం వ్యతిరేకమని తెలిపారు. రాజధాని అమరావతిపై హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పునకు సైతం ఇది వ్యతిరేకమని ఆ పిల్‌లో న్యాయవాదులు వివరించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు ఒకే ఒక్క సీటు ఉండాలని పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఉందని ఈ సందర్భంగా న్యాయవాదులు గుర్తు చేశారు. వర్చువల్ హియరింగ్స్, ఈ ఫైలింగ్స్ వచ్చిన అనంతరం ఇంకా బెంచ్‌లు ఏర్పాటు చేయడం తగదంటూ సదరు పిల్‌లో వారు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని కొట్టివేయాలంటూ దాఖలు చేసిన పిల్‌లో న్యాయవాదులు స్పష్టం చేశారు. ఈ పిల్‌ను బుధవారం విచారించే అవకాశముందని తెలుస్తోంది.

# ఉపాధిహామీలో 1.55 కోట్ల మంది కార్మికుల తొలగింపు

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 04ఆంధ్ర ప్రగతి** :మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఉన్న వారిలో 2022–24 మధ్యకాలంలో 1.55 కోట్ల మంది కార్మికుల పేర్లను తొలగించినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయమంత్రి కమలేశ్ పాసవాన్ లోక్‌సభలో ఈ విషయాన్ని వెల్లడించారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో 86,17,887 మంది, 2023–24లో 68,86,532 మంది కార్మికుల పేర్లను తొలగించినట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. రెండేళ్లలో మొత్తంగా 1,55,04,419 మంది కార్మికుల పేర్లను తొలగించామన్నారు. నకిలీ, తప్పుడు జాబ్ కార్డులు, గ్రామాల నుంచి కార్మికుల కుటుంబాలు తరలిపోవడం లేదా సంబంధిత గ్రామాలను పట్టణాలుగా వర్గీకరించడం తదితర అంశాలు ఇందుకు కారణంగా చెప్పారు.

# రైల్వే లో సీనియర్ సిటిజన్ లకు 50 శాతం రాయితీ ఇవ్వాలి.

## -ప్రత్యేక భోగి వసతి కల్పించాలని ధర్నా, వినతి.



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 04: 60 సంవత్సరాలు దాటిన వయోవృద్ధులకు అందరికీ రైల్వే టికెట్లపై50% శాతం రాయితీ కల్పించాలని, వయోవృద్ధులకు అన్ని రైళ్లలో ప్రత్యేక భోగి వసతికల్పించాలని కోరుతూ రైల్వేస్టేషన్ ముందు ఆందోళన చేపట్టి అనంతరం స్టేషన్ మాస్టర్ కి సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు.రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వి సుబ్బరాయుడు అధ్యక్షతన ధర్నా కార్యక్రమంలో ఏ ఏ రాజశేఖర్, ఏ నాగరాజు, టి మద్దులు,కే మహమ్మద్ గౌస్, శంకరయ్య, సురేష్, వెంకటేశ్వర్లు, వీర సేన, భాస్కర్ పాల్గొన్నారు.అనంతరంరైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్ సిఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ. నాగరాజు,సీనియర్ సిటిజన్ నాయకులు తోటమద్దులు, శంకరయ్య కే. మహమ్మద్ గౌస్ లు మాట్లాడుతూ 60 సంవత్సరాలు దాటిన వారికి వచ్చే ఆదాయ వనరులు చాలా తక్కువగా ఉంటాయి కుటుంబ సభ్యుల పైన ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు.మరికొందరు కుటుంబ సభ్యుల ప్రేమాభిమానాలు తగ్గిపోయి ఎలాంటి ఆధారం లేకుండావిడిగా జీవించే పరిస్థితి కొనసాగుతుంది.దూర ప్రయాణం చేయాలన్న, పుణ్యక్షేత్రాలను దర్శించాలన్న ఆర్థిక స్తోమత లేక చాలా ఇబ్బంది పడుతున్నాము. గతంలో ఇలాంటి రాయితీ వసతిని కల్పించారు. చాలా రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా రాష్ట్రాల ఆర్టీసీ బస్సులలో 25% శాతం టికెట్ పై రాయితీని కల్పిస్తున్నారు. కానీ గతంలో రైళ్లలో ఇస్తున్న రాయితీని కేంద్ర ప్రభుత్వం తొలగించటం వల్ల వయోవృద్ధులందరికీ చాలా అసౌకర్యంగాఉన్నది. పుణ్యక్షేత్రాలను దర్శించలేక పోతున్నాము. అందువలన కేంద్ర ప్రభుత్వము, రైల్వే శాఖ మంత్రి గారు ఆలోచించి రైల్వే టికెట్ పై 50%శాతం రాయితీని కల్పించి, వృద్ధులందరికీ అన్ని రైళ్లలో ప్రత్యేక భోగిని ఏర్పాటు చేసి వయోవృద్ధుల జీవనానికి సహకరించవలసినదిగా కోరారు.

# జ్ఞానమే అమృతం

## - దానికోసం నిరంతరం శోధించాలి.

### -శ్రీశ్రీశ్రీ కమలానంద భారతి స్వామీజీ విద్యార్థులకు అనుగ్రహ భాషణం.

### -ఇండస్ -మాంటిస్సోరి విద్యాసంస్థలలో గుభాళించిన సంస్కృతి పరిమళం.






ఆంధ్ర ప్రగతి కర్నూలు ఫిబ్రవరి 04: విద్య అంటే కేవలం ఉపాధి కోసమే కాకుండా, సమాజహితానికి ఉపయోగపడే జ్ఞాన సముపార్జన చేయాలని గన్నవరం భువనేశ్వరి పీఠం పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ కమలానంద భారతి స్వామీజీ విద్యార్థులకు అనుగ్రహ భాషణం చేశారు. రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇండస్ - మాంటిస్సోరి పాఠశాలల క్రీడా ప్రాంగణంలో దాదాపు మూడు వేల మంది విద్యార్థులతో సామూహిక నమస్కారములు అత్యంత శ్రద్ధా భక్తులతో నిర్వహించారు. ఈ సందర్భంగా పూజ్య స్వామీజీ విద్యార్థులకు అవసరమైన అనేక విషయాలను ఉటంకించారు. ఈ కార్యక్రమంలో మాంటిస్సోరి -ఇండస్ పాఠశాలల కరెస్పాండెంట్ కె.ఎస్.వి. రాజశేఖర్, మాంటే - మైన్స్ ఇంటర్నేషనల్ పాఠశాలల కరెస్పాండెంట్ డాక్టర్ కె.ఎస్.వి. గాయిని రాజశేఖర్, ఇండస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మీనాక్షి విల్సన్, ఇండస్ కార్య నిర్వాహక అధ్యక్షులు విల్సన్ అగస్టిన్, ప్రధానోపాధ్యాయిని కిరణ్మయి, సి.బి.ఎస్.సి. ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి, యోగా మాష్టర్ పి. శ్రీనివాసులు, గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజు గుప్త, పాలాది సుబ్రహ్మణ్యం, తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డితో పాటు బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ కాలనీలల్లోని దళితుల సమస్యలను గుర్తించండి.







## -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.

ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఫిబ్రవరి 04: ఎస్సీ ఎస్టీ కాలనీలో నూతనంగా ఎంపికైన జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సందర్శించి షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ జాతులు, అణగారిన వర్గాల ప్రజలపై దాడులు, అత్యాచారానికి గురైన బాధితులకు సత్వర న్యాయం, పరిహార చెల్లింపు తదితర సమస్యలను గుర్తించాలని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, డిఆర్ఓ రాము నాయక్, సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి, కమిటీ సభ్యులు బాల నాగన్న, నాగరాజు, కాశన్న, దేవదానం, రవికాంత్ బాబు, రమేష్ నాయక్, వెంకటేష్ నాయక్, నాగ నవీన్, మురళి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అత్యాచారానికి గురైన బాధితులకు సత్వర న్యాయం అందించడంతోపాటు నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకునేందుకు ఎస్సీ, ఎస్టీ కాలనీలలో కమిటీ సభ్యులు సందర్శించి దళితుల సమస్యలను తెలుసుకోవాలన్నారు. ఎస్సీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా పేద దళిత వర్గాలకు రుణాలు అందించేందుకు ప్రభుత్వం ఇటీవలనే నిధులు మంజూరు చేసిందని ఆసక్తిగల నిరుద్యోగ యువత స్వయం ఉపాధి రుణాలు పొందేందుకు కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలన్నారు. గత సమావేశంలో సూచించిన 17 కేసులకు సంబంధించిన కేసుల వివరాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలన్నారు. కమిటీ సభ్యులు తమ పరిధిలోని అన్ని సంక్షేమ హాస్టల్లో టాయిలెట్లు, త్రాగునీరు, ఇతర మౌలిక వసతులపై సమీక్షించాలని కలెక్టర్ సూచించారు. కమ్యూనిటీ భవన నిర్మాణాల స్థానాలలో పిల్లలకు ఉపయోగపడే వాటిపై దృష్టి పెట్టాలన్నారు. 2022 ఏప్రిల్ నుండి సెప్టెంబర్ 2024 వరకు 232 కేసులు ఎఫ్ఐఆర్ నమోదు కాగా 380 మంది బాధితులకు సంబంధించి 5.19 కోట్ల రూపాయలను పంపిణీ చేశామని కలెక్టర్ తెలిపారు. అలాగే అక్టోబర్ 2024 నుండి డిసెంబర్ 2024 వరకు 40 కేసులు నమోదు కాగా 60 మంది బాధితులకు 63 లక్షల రూపాయలను పంపిణీ చేశామని కలెక్టర్ కమిటీ సభ్యులకు వివరించారు. ఇంకా 21 కేసులకు సంబంధించి కోటి రూపాయల పరిహార ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించామన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ఎస్సీ ఎస్టీ బ్యాక్ ల్యాగ్ ఖాళీల వివరాలను తెప్పించుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. నంద్యాల పట్టణంలో బొమ్మల సత్రం అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు చుట్టూ సుందరీకరణ, మున్సిపల్ టౌన్ హాల్ లేదా చిన్న చెరువు కట్ట ప్రదేశాలలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు నిర్ణయం తీసుకొని ప్రతిపాదనలు వారంలోగా ఇవ్వాలని కమిటీ సభ్యులను సూచించారు.జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసులను దాదాపుగా క్లియర్ చేశామన్నారు. ఎస్సీ ఎస్టీ అత్యాచార బాధితులు, ఇందుకు సంబంధించిన సాక్షులను కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తూ నిజమైన కేసులకు శిక్షపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిజ నిర్ధారణ కేసులకు శిక్ష పడితే నేరాలు తగ్గుముఖం పడతాయని ఎస్పీ తెలిపారు. సఫాయికర్మాచార్యుల సమస్యలను పరిష్కరిస్తాం.సఫాయి కర్మచారులకు జీతభత్యాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. చెల్లిస్తున్న జీతాలలో ప్రావిడెంట్ ఫండ్ పోను చెల్లిస్తున్న జీతభత్యాలు స్లిప్పులను కర్మచారులకు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. మున్సిపాలిటీ, ఆస్పత్రులు, దేవాలయాలలో సఫాయి కర్మచార్యులు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక గదులను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి,. డిఎంహెచ్వో వెంకటరమణ, డిసిహెచ్ఎస్ జఫ్రూల, తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులను ప్రోత్సహించండి.

## -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.



ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఫిబ్రవరి 04:ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటలు పండించడం వల్ల అధిక లాభాలు వస్తాయని సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. మంగళవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ నరేంద్ర రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి నాగరాజు డిఆర్డిఎ ప్రాజెక్టు శ్రీధర్ రెడ్డి డిపిఎం నరేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో అధిక లాభాలను ఇచ్చే ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులను ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తున్న తీరుతెన్నులను సమీక్షిస్తూ రైతుల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి మండలంలో రైతుల అవగాహన కోసం ఐదు మోడల్ ప్రాజెక్టులు ఎంపిక చేయాలని సూచించారు. ఇందులో అంగన్వాడీ కేంద్రం, పాఠశాల, హాస్టల్, రెండు మహిళా స్వయం సహాయ సంఘాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ మోడల్స్ ప్రాజెక్టులు రైతులకు ప్రేరణగా నిలవడంతోపాటు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు మరింత విస్తరించేందుకు ఉపయోగపడేలా ఉండాలన్నారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతులు, ప్రకృతి వ్యవసాయం మరింత మెరుగుపరిచే దిశగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# జర్నలిస్ట్ పాలూరి రమణ అరెస్టును ఖండిస్తున్నాం.!

## -జర్నలిస్ట్ రమణ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సిఐ పై చర్యలు చేపట్టాలి.

## -జర్నలిస్టులపై దాడులను ఆపాలి హక్కులను కాపాడాలి.

## -సీఎం జర్నలిస్టుల మీడియా స్వేచ్ఛను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలి.



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 04: సీనియర్ జర్నలిస్ట్ పాలూరి రమణ మంత్రులు టీసి భరత్ ఎన్ ఎం డి ఫరూక్ లపై పలు ఆరోపణలు చేస్తూ తన యూట్యూబ్ ఛానల్ లో పోస్ట్ చేసిన విషయంపై అలాగే మంత్రి టీజీ భరత్ సన్నిహితుడు విటల్ శెట్టి బ్లాక్మెయిల్ చేశాడంటూ పోలీసులు కేసులు నమోదు చేసి కర్నూలు మూడవ పట్టణ సిఐ శేషయ్య గత శనివారం రాత్రి అరెస్టు చేయడం జరిగింది. రమణను కర్నూలు మూడవ పట్టణ సిఐ శేషయ్య శనివారం రాత్రి అరెస్టు చేస్తున్న సందర్భంలో ఉదయాన్నే పోలీస్ స్టేషన్ కు వస్తానని చెప్పినా కూడా సీఐ వినకుండా... దొంగల కోసం అర్ధరాత్రి వస్తానని చెప్పి అనుచిత వ్యాఖ్యలు చేసి అరెస్టు చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో సీనియర్ జర్నలిస్ట్ రమణ పై సిఐ శేషయ్య చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం నంద్యాల జిల్లా జర్నలిస్ట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా ఎస్పీ అది రాజ్ సింగ్ రాణా ను కలిసి వినతి పత్రం సమర్పించడం జరిగింది. సీఐ శేషయ్య పై చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా జర్నలిస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు సీనియర్ పాత్రికేయులు ప్రభాకర్ చౌదరి,శ్రీనివాసులు మాట్లాడుతూ...ఉమ్మడి కర్నూలు జిల్లాలో జర్నలిస్టుగా పలు మీడియా సంస్థలలో పనిచేసిన సీనియర్ జర్నలిస్ట్ పాలూరి రమణను గత శనివారం పోలీసులు అరెస్టు చేశారని, ఈ నేపథ్యంలో సీఐ శేషయ్య జర్నలిస్ట్ రమణను దొంగల కోసం అర్ధరాత్రి వస్తామని అని అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇది యావత్ జర్నలిస్టులను అవమానపరిచినట్లే అని అన్నారు. ఏవైనా మీడియాలో వార్తలు జర్నలిస్టులు ప్రచురించిన, పోస్ట్ చేసిన వాటిపై ఖండనలు, పరువు నష్టం దావా వేయవచ్చని అయితే ఓ సీనియర్ జర్నలిస్టును సీఐ అనుచిత వ్యాఖ్యలు చేసి అవమానపరచడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. సిఐపై చర్యలు తీసుకోవాలని కర్నూల్ డిఐజిని, నంద్యాల జిల్లా ఎస్పీని కోరడం జరిగిందని తెలిపారు. నంద్యాల జిల్లా ఎస్పీ స్పందిస్తూ సీఐపై తగిన చర్యలను చేపడతామని హామీ ఇచ్చారన్నారు. నంద్యాల జిల్లా జర్నలిస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిదులు జాకీర్, ప్రదీప్, మాట్లాడుతూ.. కర్నూలు మూడో పట్టణ సిఐ శేషయ్య జర్నలిస్టు రమణపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. జర్నలిస్టులను దొంగలుగా, దోషులుగా, గుండాలుగా చూడడం, దాడులు చేయించడం సరైన పద్ధతి కాదని ఇటువంటి చర్యలకు స్వస్తి పలకాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జర్నలిస్టుల పట్ల మంచి ప్రవర్తనతో ఉండాలని నాయకులకు, అధికారులకు సూచనలు ఇచ్చారని, అయితే సీఎం సూచనలను రాష్ట్రంలో ఎక్కడ పాటిస్తున్నట్లు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులను వేధించడం, బెదిరించడం, దాడులు చేయడం వంటివి ఇకనైనా జరగకుండా తగు చర్యలను తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి జర్నలిస్టుల, మీడియా స్వేచ్ఛను కాపాడాలని, అధికారులకు ఆదేశాలను సూచనలను ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా జర్నలిస్ట్ యాక్షన్ కమిటీ సభ్యులు.ప్రభాకర్ చౌదరి,మాదాల శ్రీనివాసులు,దేవేందర్ రెడ్డి, విజయ్,శరత్ బాబు,ప్రదీప్ సాల్మన్ రాజ్,చల్లా మధు, జాకీర్,సతీష్,చార్లెస్,మౌలాలి,యలనాటి జాషువా,ముసుగు రాజు,రఘు, పవన్,భరత్, శివరామకృష్ణ,నూర్ భాషా,గణేష్,సియం నాగేంద్ర, నాగరాజు,రాము, జమాల్ బాషా,మోహన్, శ్రీను,నరసింహమూర్తి,శివరాం,అల్లాబకాష్,రామన్న, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో

## గోడ పత్రిక ఆవిష్కరణ



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 04: మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు తక్షణమే ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ప్రధాన డిమాండ్తో హైదరాబాద్ కేంద్రంగా తలపెట్టిన లక్షల డబ్బులు వే ల గొంతుల కార్యక్రమం ఈనెల ఏడవ తేదీన జరుగుతున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన కరపత్రాలను గోడపత్రికలను నంద్యాల నియోజకవర్గంలోని రెండు మండలాలలో విడుదల చేయడం జరిగింది. నంద్యాల మండలం జిల్లా కేంద్రంలో స్థానిక బయటపేట ఆంజనేయ స్వామి దేవస్థానం దగ్గర ఎమ్మార్పీఎస్ నంద్యాల జిల్లా నాయకులు దెబ్బల సురేంద్ర మాదిగ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది అందుకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ రాష్ట్ర అధ్యక్షులు బాయకాటి బెనర్జీ మాదిగ మరియు గాయకులు బడిదల ప్రదీప్ మాదిగలు మరియు ఎమ్మార్పీఎస్ నంద్యాల టౌన్ నాయకులు చంటి మాదిగలు మరియు మాదిగ మహిళలు ఎంఎస్పి నేతలు పాల్గొనడం జరిగింది. గోస్పాడు మండల కేంద్రంలో స్థానిక సచివాలయం దగ్గర ఎంఎస్పి జిల్లా నాయకులు కొట్టం ఓబులపతి మాదిగ ఆధ్వర్యంలో విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్పీ నాయకులు మోహన్ నాగమద్దిలేటి, బాబు మాదిగ వెంకటేశ్వర్లు మాదిగ చంద్ర మాదిగ తదితరులు పాల్గొన్నారు. అలాగే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం గారి దగ్గర కూడా గోడ పత్రికలను విడుదల చేయడం జరిగింది. వేలాదిగా నంద్యాల నియోజకవర్గంలో నుంచి పాల్గొనాలని చెప్పి నాయకులు పిలుపునిచ్చారు ఎస్సీ వర్గీకరణ జరుగుతే ఈ లక్షల డబ్బులు వేల గొంతులు విజయోత్సవ సభ నిర్వహిస్తాయని ఒకవేళ ప్రభుత్వాలు గనుక వర్గీకరణ చేపట్టకపోతే ఆ ప్రభుత్వ పతనానికి చావు డబ్బు మోయిస్తాయని చెప్పి నాయకులు పిలుపునిచ్చారు.

## ప్రకృతి వ్యవసాయ పొలాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా




ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఫిబ్రవరి 04: నంద్యాల మండలం పాండురంగాపురంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తున్న రైతుల పొలాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. మంగళవారం గ్రామంలోని మధుసూదన్ రెడ్డి, కేశవ్ రెడ్డి పొలాలను పరిశీలించి, వారు అవలంబిస్తున్న విధానాలను సమీక్షించారు. రైతులతో నేరుగా మాట్లాడి వారి అనుభవాలను స్వయంగా తెలుసుకున్నారు. రైతులు తమ అనుభవాలను పంచుకుంటూ, రసాయన రహిత సాగుతో వచ్చిన లాభాలను కలెక్టర్ కు వివరించారు. పాండురంగపురంలోనే న్యాచురల్ ఫార్మింగ్ ద్వారా తయారు చేస్తున్న ఊరగాయలు, స్నాక్స్ తయారీ కార్యక్రమాలను పరిశీలించారు. స్థానిక తయారీదారులతో మాట్లాడి, వారి ఉత్పత్తుల విస్తరణ, మార్కెట్ అవకాశాలపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పాండురంగాపురం సర్పంచ్, ఎంపిటిసి, గ్రామ నాయకులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ చాపిరేవుల గ్రామంలో తేనె సంస్కరణ (హనీ కల్చివేషన్) కార్యకలాపాలను పరిశీలించి, తేనెటీగల పెంపకం మరియు తేనె తయారి ప్రక్రియ గురించి వివరంగా అడిగి తెలుసుకున్నారు. "ఇలాంటి చిన్నతరహా పరిశ్రమలను మరింత ప్రోత్సహించి, రైతులకు అదనపు ఆదాయ వనరులను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

## తబ్లిగ్ ఇస్తేమా విజయవంతానికి సహకరించిన రాష్ట్ర మంత్రి ఎన్ ఎం డి ఫరూక్, ఫిరోజ్ కిక్కృతజ్ఞతలు

ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 04:
ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆత్మకూరు పట్టణం నందు జనవరి 7,8,9 తేదీల నందు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించబడిన తబ్లిగ్ ఇస్తేమా సమాఖ్య విజయవంతంగా ముగిసింది. ఈ పవిత్ర కార్యక్రమం ఎటువంటి ఆటంకాలు లేకుండా శాంతియుతంగా నిర్వహించడానికి చేసిన నిరంతర కృషికి గుర్తింపుగా తెలుగు దేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎం డి ఫిరోజ్ ని ఇస్తేమా కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఇస్తేమా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ, రాష్ట్ర మంత్రి ఫరూక్, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఫిరోజ్ కృషి వల్లే ఇస్తేమా నిర్వహణ కోసం అన్ని అవసరమైన అనుమతులు పొందడం, స్థానిక పరిపాలనా వ్యవస్థతో సమన్వయం చేయడం, పోలీస్ భద్రత, మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేయడం వంటి అనేక విధాలుగా సహాయం చేశారని కొనియాడారు. అంతేగాక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి ఫరూక్ ఈ మహాసభ నిర్వహణ కోసం రూ. 2 కోట్లు నిధులు కేటాయించి, అన్ని




రకాల సహాయ సహకారాలు అందించారని కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ ఆర్థిక సాయంతో ఇస్తేమా కార్యక్రమం మరింత వైభవంగా, భక్తిపూర్వకంగా జరిగిందని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ ఎమ్ డి ఫిరోజ్ మాట్లాడుతూ, "ఈ ఇస్తేమా కార్యక్రమం అత్యంత పవిత్రమైనది, ముస్లింల విశ్వాసాన్ని నిలబెట్టేలా అన్ని రకాల ఏర్పాట్లు చేయడం మా బాధ్యత. కుల మతాలకు అతీతంగా భవిష్యత్తులో కూడా ఇలాంటి మతపరమైన కార్యక్రమాలకు మా తరుపున పూర్తిస్థాయిలో సహాయ సహాకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈ



ఇస్తేమా కోసం ప్రభుత్వ అధికారులు పోలీస్ శాఖ, స్థానిక యంత్రాంగానికి, ముస్లిం మత పెద్దలకు, భక్తులకు ఇస్తేమా కమిటీ సభ్యులకు సమన్వయం తీసుకువచ్చి ఈ ఇస్తమానం ఎటువంటి ఆటంకం కలగకుండా ఒక చిన్న తోపులాట గాని సంఘటన జరగకుండా విజయవంతం కావడంలో సహకరించినందుకు రాష్ట్ర మంత్రి ఫరూక్ కి, తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ మత పెద్దలు, ఇస్తేమా కమిటీ సభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, ముస్లిం సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతన్నకు అండగా కూటమి ప్రభుత్వం





ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ ఫిబ్రవరి 04:
ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ లో నాఫెడ్ మరియు ఆంధ్రప్రదేశ్ మార్క్ఫెడ్ ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని కూటమి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆదేశాల మేరకు ఆళ్లగడ్డ జనసేన పార్టీ సమన్వయకర్త మైలేరి మల్లయ్య , నాఫీడ్ శర్మ, మార్ఫెడ్ డిఎం హరినాథ్ రెడ్డి, అగ్రికల్చర్ ఏడిఏ రామ్మోహన్ రెడ్డి ప్రారంభించారు. మార్ఫెడ్ డిఎం హరినాద్ రెడ్డి, ఏడిఏ హరినాథ్ రెడ్డి గారు మాట్లాడుతూ ఆళ్లగడ్డ నియోజకవర్గం లో 2400 మంది రైతులు 5800 ఎకరాలు కంది సాగు చేశారని, రైతు పండించిన కందులను క్వింటాకు 7,550/ అని చెల్లిస్తామని, నియోజవర్గ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. మైలేరి మల్లయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతు పండించిన పంటను సకాలంలో దళారులకు చేతిలో మోసపోకుండా గిట్టుబాటు ధర కల్పిస్తూ రైతులకు అండగా ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రివర్యులు నారా లోకేష్, కూటమి ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ గారు పనిచేస్తున్నారని తెలియజేశారు. గత వైసిపి పాలనలో రైతుల నుంచి కొనుగోలు చేసిన పంట డబ్బులు నెలల తరబడి రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయకుండా రైతుల ఆత్మహత్యలకు కారణమైందని తెలియజేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఖరీఫ్ 2024-2025 పాడి పంటను 31,52,783 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించిందని, రైతులకు చెల్లించిన మొత్తం 7222 వేల కోట్లు చెల్లించారని , లబ్ధి పొందిన రైతులు 5 లక్షల 352 మందిని తెలియజేశారు. రైతు ధాన్యం అమ్మిన 24 గంటల లోపు రైతుల బ్యాంకు ఖాతాలో కూటమి ప్రభుత్వం డబ్బు జమ చేస్తుందని తెలియజేశారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో రైతులకు కూటమి ప్రభుత్వము, భూమా అఖిలప్రియ గారు అండగా ఉంటారని, రైతు పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను దళారుల నుండి కాపాడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యాడ్ సెక్రెటరీ నారాయణస్వామి, సూపర్వైజర్ సురేష్ , డీసీఎంఎస్ నాగ ప్రవీణ్, రవి, డివిజన్ ఏవోలు , ప్రకృతి వ్యవసాయ డివిజన్ ఇన్చార్జి పత్తి నాగేశ్వర్ రెడ్డి, సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

## సమిష్టి కృషితో కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు తెచ్చి మేలు చేద్దాం.

### -ఢిల్లీ లో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్ శాఖ మంత్రి నారా లోకేష్ సమావేశమైన టీడీపీ ఎంపీ లు.




ఆంధ్ర ప్రగతి న్యూఢిల్లీ ఫిబ్రవరి 04: కలిసికట్టుగా పనిచేసి రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నుంచి అధిక నిధులు రాబట్టాలని, ఐక్యత ఉండటం వల్లే విశాఖ స్టీల్ ను కాపాడుకోగలిగాం, రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఇక ముందు కూడా ఇదే పంథా కొనసాగిద్దామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. మంగళవారం సాయంత్రం ఢిల్లీలో కేంద్ర మంత్రులు శ్రీనివాస వర్మ, రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీ ఎంపీ, బైరెడ్డి శబరి , బీజేపీ నేతలు మంత్రి లోకేష్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్బంగా ఎంపీ లు కలిసి కట్టుగా పనిచేయడం వల్ల తీవ్రంగా నష్టపోయిన రాష్ట్రానికి కేంద్రం నుంచి నిధులు రాబట్టగలిగామని, ఇంకా ఎక్కువ నిధులు తెచ్చేలా పనిచేద్దాం అన్నారు.

## 9 న 1వ రాష్ట్ర స్థాయి యోగ ప్రీమియర్ లీగ్


**కర్నూలు ఫిబ్రవరి 0 4ఆంధ్ర ప్రగతి**
యోగ అసోసియేషన్ ఆఫ్ కర్నూల్ డిస్టిక్ ఆధ్వర్యంలో ఈనెల తొమ్మిదవ తేదీన నగర శివారులోని పెద్దపాడు వద్ద ఉన్న వేదన్ని పాఠశాల నందు ఒకటవ రాష్ట్ర స్థాయి యోగ ప్రీమియర్ లీగ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర యోగ సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి మంగళవారం తెలిపారు. 8 నుంచి 10 సంవత్సరాల లోపు ఒక కేటగిరీగా,10 నుంచి 12 సంవత్సరాల లోపు బాల బాలికలకు మరో కేటగిరీగా,12 సంవత్సరాల నుండి 14 సంవత్సరాల మరో కేటగిరీగా,14 నుంచి 16 సంవత్సరాలలోపు బాల బాలికలకు మరో కేటగిరీగా, 16 నుంచి 19 వరకు, 19 పైబడి 29 లోపు మరో కేటగిరీగా,30 సంవత్సరాలు పైబడి 45 సంవత్సరాలు లోబడి వారికి మరో కేటగిరి, 45 సంవత్సరాల పైబడిన వారికి మరో కేటగిరీగా పోటీలను కండక్ట్ చేస్తున్నట్లు ఆయన వివరించారు. పోటీలలో పాల్గొనే క్రీడాకారులు 300 రూపాయల ప్రవేశ రుస్తుము చెల్లించి సంబంధిత జిల్లా సంఘాల అధ్యక్ష కార్యదర్శుల అనుమతితో పోటీల్లో హాజరు కావచ్చు అన్నారు. మరిని వివరాలకు9391347212,8885871715 ఫోన్ నెంబర్లకు సంప్రదించవచ్చు అన్నారు.

# మహానందయ్య ఫోటో తొలగించండి..!

ఆంధ్ర ప్రగతి మహానంది ఫిబ్రవరి 04:
మహానంది దేవస్థానం కార్యాలయంలోఏర్పాటుచేసిన మహానందయ్య చిత్రపటాన్ని వెంటనే తొలగించాలని ఆర్ జె డి ఆ "జాదు" మంగళవారం ఆదేశించడం చర్చనీయాంశంగా మారింది. స్వాతంత్ర్యం రాక ముందు పూర్వం నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన మహానంది దేవస్థానం ఉందని ఎవరికి తెలియదు. ఆ ప్రాంతమంతా అటవీ జంతువులు తిరగడంతో పాటు నర మానవుడు కూడా ప్రవేశించలేని ప్రాంతంగా ఉండేదని గతించిన పెద్దలు పేర్కొనేవారు. అలాంటి సమయంలో మహానందయ్య అనే మహానుభావుడు మహానంది అనే ఒక క్షేత్రం అక్కడ ఉందని బయటి ప్రపంచానికి తెలియజేయడంతో పాటు ఆలయ అభివృద్ధి పరిచి అప్పట్లోనే నిత్యం ఉదయం సాయంత్రం పూజ కార్యక్రమాలు నిర్వహించి నంద్యాలకు చేరుకునే వారని నానుడి. కాలక్రమేణా క్షేత్రం అభివృద్ధితోపాటు దాదాపు 55 ఎకరాల భూమిని దానం చేయడంతో పాటు ఆలయ అభివృద్ధికి ఎంతో సేవ చేసిన ఆ




మహానుభావుడి ఫోటో తొలగించమని స్థానిక ఈవో నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ని ఆదేశించడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. అక్కడ ఉన్న పత్రిక విలేకరులతో పాటు, స్థానిక సిబ్బంది మహానందయ్య గురించి తెలపగా అలాంటివారు కోకొల్లలుగా ఉన్నారని అందరి ఫోటోలు కార్యాలయంలో ఏర్పాటు చేస్తారా అని ఈవోను ప్రశ్నిస్తూ మరలా వచ్చేసరికి ఆ చిత్రపటం అక్కడ ఉండకూడదని అవహేళన చేస్తూ ఆదేశాలు జారీ చేయడం వివాదాస్పదంగా మారింది. పై స్థాయిలో ఉన్న అధికారులకు ఇలాంటివి మామూలే నా అనే ప్రశ్నలు వెలువెత్తుతున్నాయి. మరి కొన్ని క్షేత్రాల్లో రాజుల పేర్లు




వారి శిల్పాలు ఉన్నాయి వాటిని తొలగిస్తారా.... అధికారులు స్థానికంగా ఉన్న వాటిపై అవగాహన లేక అలా ప్రవర్తిస్తున్నారా.. లేక నేను పై అధికారిని కదా నేను చెప్పిందే వేదం అనే ధోరణిలో ప్రవర్తిస్తున్నారా అనేది తెలియాల్సి ఉంది. మహానందయ్య చిత్రపటాన్ని తొలగిస్తే స్థానికంగా తీవ్ర వ్యతిరేకత ఎదురు అవడంతో పాటు సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది అని సమాచారం. దీనికి బాధ్యత అధికారులు వహిస్తారా అనేది తెలియాల్సి ఉంది. ఆలయ చరిత్ర తెలియకుండా మాట్లాడితే ఏమిటి లాభం అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

## విద్యుత్ బిల్లులు చెల్లించుటకు ఎలక్ట్రిసిటీ బిల్లు యందు డైనమిక్ క్యూఆర్ కోడ్ నమోదు

**కర్నూలు ఫిబ్రవరి 0 4ఆంధ్ర ప్రగతి**
కర్నూలు డివిజన్ కర్నూల్ పట్టణం, కల్లూరు మండలం, ఓర్వకల్ మండలం మరియు కర్నూలు మండలం పరిధిలో గల ప్రజలకు APSPDCL సంస్థ వారు తెలియజేయు శుభవార్త ఏమనగా విద్యుత్ బిల్లులు చెల్లించుటకు గాను, మనకు ఇచ్చిన ఎలక్ట్రిసిటీ బిల్లు యందు డైనమిక్ %ు=% కోడ్ నమోదు చేసియున్నారు. కావున ప్రజలందరు ఈ యొక్క డైనమిక్ %ు=% కోడ్ ను స్కాన్ చేసి మీరు వున్న చోటు నుండే విద్యుత్ బిల్లులను చెల్లించవచ్చు. ఈ అవకాశమును ప్రతి ఒక్కరు వినియోగించుకొని సంస్థ అభివృద్ధికి తోడ్పడవలసినదిగా కోరడమైనది..

## వీడియో జర్నలిస్టు సురేంద్ర మృతికి సంతాపం.. దహన సంస్కారాలకు 10వేల ఆర్థిక సహాయం

**కర్నూలు ఫిబ్రవరి 0 4ఆంధ్ర ప్రగతి**



కర్నూల్ లో ఏబీఎన్ న్యూస్ ఛానల్ లో వీడియో జర్నలిస్టుగా పనిచేస్తున్న సురేంద్ర అలియాస్ చిన్న ఆకస్మికంగా మృతి చెందారు. ఉదయం గుండెపోటు రావడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమద్యంలో మృతి చెందాడు. వీడియో జర్నలిస్ట్ మృతికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, సంఘం నాయకులు, ముత్తుకూరు గౌడప్ప సంఘం అధ్యక్షుడు జర్నలిస్ట్ సత్యన్న సంతాపం ప్రకటించారు. ఆయన స్వగృహం దిన్నెదేవరపాడు గ్రామానికి వెళ్లి సురేంద్ర కుటుంబ సభ్యులను ఓదార్చారు. సురేంద్ర కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. దహన సంస్కారాలకు నక్కలమిట్ట శ్రీనివాసులు 10 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు.

# శాంతినికేతన్ పాఠశాలలో ఘనంగా రథసప్తమి వేడుకలు







ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 4: నంద్యాల క్రాంతి నగర్ నందలి శ్రీ శాంతినికేతన్ సి బి ఎస్ ఈ పాఠశాల యందు మంగళవారం నాడు క్రీడాభారతి ఆధ్వర్యంలో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీ రామకృష్ణ విద్యా సంస్థల అధినేత, రాష్ట్ర క్రీడాభారతి ఉపాధ్యక్షులు డాక్టర్ జి. రామకృష్ణారెడ్డి, హేమంత్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో శ్రీ శాంతినికేతన్ విద్యాసంస్థల అధినేత సుధాకర్ మాట్లాడుతూ రథసప్తమి నాడు ఉదయమే సూర్యనమస్కారాది కార్యక్రమాలు నిర్వహిస్తే సూర్యుని నుండి వెలువడే అత్యంత శక్తిని పొందుకొని, శారీరకంగా ,మానసికంగా దృఢత్వం పొందుతారు. అన్నారు. సూర్యుని నుండి వెలువడే శక్తి ఒక్క మానవులకు మాత్రమే కాకుండా సకల చరాచర జగత్తు కూడా ఈ శక్తి పొందుకుంటుందన్నారు. తదుపరి కార్యక్రమానికి హాజరైన అతిథులు మరియు విద్యార్థులందరూ సూర్య నమస్కారం, ఆసనాలు మొదలైన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ



శాంతినికేతన్ విద్యాసంస్థల చైర్మన్ సుధాకర్ , క్రీడా భారతి సభ్యులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# ఐఎంఏ, ఉదయానంద ఆసుపత్రి ఆధ్వర్యంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ ర్యాలీ

**-ర్యాలీ ప్రారంభించిన ఏ. ఎస్. పి.జావళి అల్ఫోన్స్. -క్యాన్సర్ పై ప్రజా అవగాహన కరపత్రాల విడుదల. -టౌన్ హాల్ ప్రాంగణంలో క్యాన్సర్ పరీక్షల పింక్ బస్ శిబిరం.**





ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 04:
నంద్యాల ఐఎంఏ, ఉదయానంద క్యాన్సర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో, ఉదయానంద ఆసుపత్రి వైద్యులు భార్గవరెడ్డి, క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ సాయి ప్రణీత్, డాక్టర్ నాగ సుదర్శన్ రెడ్డి, క్యాన్సర్ మెడికల్ వైద్య నిపుణులు డాక్టర్ సుస్మిత, క్యాన్సర్ రేడియేషన్ నిపుణులు డాక్టర్ సురేఖ ల నిర్వహణలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం ఉదయం ఉదయానంద క్యాన్సర్ ఆసుపత్రి నుండి కలెక్టరేట్ కార్యాలయం వరకు క్యాన్సర్ వ్యాధిపై ప్రజా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎ.ఎస్.పి జావళి ఆల్ఫోన్స్ జండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎఎస్పీ జావళి ఆల్ఫోన్స్ , మాజీ పార్లమెంట్ సభ్యులు పోచ బ్రహ్మానంద రెడ్డి,ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ జి.రవి కృష్ణ, ఐఎంఏ నంద్యాల అధ్యక్షులు డాక్టర్ మధుసూదన్ రావు అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి గుర్తించగానే భయాందోళనలకు గురి కావలసిన అవసరం లేదని,క్యాన్సర్ వ్యాధి ప్రాథమిక దశలోనే గుర్తించడం ద్వారా క్యాన్సర్ ను ప్రస్తుతం అందుబాటులో ఉన్న అత్యాధునిక వైద్య వసతులతో నయం చేయవచ్చని అన్నారు. క్యాన్సర్ వ్యాధి లక్షణాలు రాకమునుపే కొన్ని క్యాన్సర్లని ముందస్తుగా కనుక్కునే పరీక్షలు చేయించుకోవడం అవసరమన్నారు. క్యాన్సర్ వ్యాధి చికిత్సలు ఎన్టీఆర్ ఆరోగ్య సేవలో ఉచితంగా అందుతున్నాయన్నారు. నంద్యాల ఉదయానంద క్యాన్సర్ ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన క్యాన్సర్ చికిత్సల అత్యాధునిక వసతులు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా క్యాన్సర్ పై ప్రజా అవగాహన కరపత్రాలను అతిథులు ఆవిష్కరించారు. గర్భాశయ క్యాన్సర్ కు, రొమ్ము క్యాన్సర్ కు మరియు ఇతర క్యాన్సర్ పరీక్షలను నిర్వహించే ఉదయానందా క్యాన్సర్ ఆసుపత్రి పింక్ బస్సును ప్రారంభించారు.

**పింక్ బస్ లో క్యాన్సర్ వ్యాధి పరీక్ష శిబిరం**

టౌన్ హాల్ ప్రాంగణంలో ఉదయానంద క్యాన్సర్ ఆసుపత్రి పింక్ బస్సులో ఉచితంగా గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ గుర్తించే ప్యాప్ స్మియర్ పరీక్షలు, రొమ్ము క్యాన్సర్ ను గుర్తించే మ్యామోగ్రఫీ పరీక్షలు, కోల్పోస్కోపి పరీక్షలను నిర్వహించే శిబిరాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఉదయానంద ఆసుపత్రి నిర్వాహకులు పరమేశ్వర రెడ్డి, రామకృష్ణారెడ్డి, కేశవరెడ్డి విద్యాసంస్థల చైర్మన్ కేశవరెడ్డి, ప్రముఖ వైద్యులు డాక్టర్ గేలివి సహదేవుడు, ఐఎంఏ నంద్యాల మహిళా విభాగం గౌరవాధ్యక్షురాలు డాక్టర్ నర్మద, అధ్యక్షురాలు డాక్టర్ కల్పన,
కార్యదర్శి డాక్టర్ అనూష, డాక్టర్ భాగ్యలక్ష్మి,లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు నిజాముద్దీన్, శిరిగిరిరమేష్ ,కోశాధికారి మామిల్ల నాగరాజు, సభ్యుడు మేడా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ ప్రభుత్వం ద్వార అందించే సబ్సిడీ ఋణాలను సద్వినియోగం చేసుకోండి






ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 04: పార్టీలకు అతీతంగా రాష్ట్ర ప్రజల సంక్షేమం కొరకు నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి ని పెంపొందిస్తూ సబ్సిడీ ఋణాలను అందిస్తాం నంద్యాల ప్రజలు ఈ సబ్సిడీ ఋణాలను సద్వినియోగం చేసుకొని వ్యాపార రంగంలో అభివృద్ధి చెందలాని నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ కోరారు.ఈ సందర్భంగా స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ఏర్పాటుచేసిన సమావేశంలో ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ బీసీల సంక్షేమం కొరకు నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధిని పెంపొందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా సబ్సిడీ ఋణాల కార్యక్రమం ప్రారంభించడం జరిగిందిని . సబ్సిడీ రుణాలపై అవగాహన సదస్సులో ఫిరోజ్ తెలిపారు . తెలుగుదేశం పార్టీ నంద్యాల అసెంబ్లీ నాయకులకు కార్యకర్తలకు ఈ సబ్సిడీ ఋణాలపై నిపుణులచే అవగాహన కల్పించడం జరిగింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలుగుదేశం పార్టీ బీసీల సంక్షేమం కొరకు ఇచ్చిన మాటను నిజం చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది రూపాయలను వెచ్చించి బీసీలలోనున్న నిరుద్యోగ యువతను స్వయం ఉపాధిలో పెంపొందించేందుకు వ్యాపారస్తులు వ్యాపారంలో మరింత స్థిరపడే విధంగా తోడ్పాటుగా సబ్సిడీ ఋణాలను అందించడం జరుగుతుందన్నారు.
తెలుగుదేశం పార్టీ బీసీల పక్షపాతి బీసీల సంక్షేమం కోసం ఎంతవరకైనా కృషి చేస్తుందని మరోసారి రుజువైందన్నారు. గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం ఏ ఒక్కరికి కూడ సబ్సిడీ ఋణం అందించి సహకరించకుండా దగా చేసిందన్నారు.
తెలుగు దేశం పార్టీ పేద ప్రజల భవిష్యత్తు కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర మంత్రి నారా లోకేష్ రాష్ట్రవ్యాప్తంగా ఈ ఐదేళ్లలో 20 లక్షల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు సాధించేలా కృషి చేస్తున్నారు అదేవిధంగా నిరుద్యోగ యువత స్వయం ఉపాధిని పెంపొందిస్తూ వ్యాపారంలో స్థిరపడేలా ప్రతి ఒక్కరూ ఆర్థికంగా స్వతంత్రంగా ఉండాలని ప్రత్యేకంగా సబ్సిడీ రుణాలు అందిస్తోందన్నారు.ఈ సబ్సిడీ ఋణాలతో అర్హత కలిగిన నిరుద్యోగ యువతకు తక్కువ వడ్డీ రుణాలతో వ్యాపార అభివృద్ధికి ఆర్థిక మద్దతుదందించి ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా బలపరిచే కార్యక్రమం అన్ని వర్గాల ప్రజలు సమగ్ర అభివృద్ధి చేందేందుకు కృషి చేస్తున్నామన్నారు.ఇది కేవలం రుణ పథకం కాదని ఇది మీ భవిష్యత్తును నిర్మించే అవకాశమని , ఆంధ్రప్రదేశ్ లో నిరుద్యోగాన్ని తొలగించే క్రమంలో చంద్రన్న ప్రభుత్వం సాగుతుందన్నారు. దానితోపాటు గత ఎన్నికలలో తన ప్రాణాలను సైతం లెక్కచేయ్యకుండా నిరంతరం కృషి చేస్తూ తెలుగుదేశం జెండాను రెపరెపలాడించిన కార్యకర్తలు కూడా ఈ సబ్సిడీ ఋనాలను పొంది అభివృద్ధి చెందాలని ఈ సందర్భంగా తెలిపారు.నంద్యాల ప్రజలందరికి తోడుంటాం అందరిని ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తామని మన ప్రాంత ప్రజలకు ఉజ్వలమైన భవిష్యత్తును కల్పిస్తామని ఎన్ ఎం డి ఫిరోజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల శ్రీరాములు , టిడిపి నంద్యాల పట్టణ అధ్యక్షులు మనియార్ ఖలీల్ , కౌన్సిలర్ ఖండే శ్యాం సుందర్ లాల్, మహిళ అధ్యక్షురాలు విజయగౌరీ, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి బలమా? వైసీపీ లోపమా?

## మున్సిపాలిటీల్లో ఎందుకు దెబ్బ పడింది!



**ఫిబ్రవరి 04ఆంధ్ర ప్రగతి**
అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం తర్వాత వైసీపీకి వరుస ఓటములే పలుకరిస్తున్నాయి. రాష్ట్రంలో ఏ ఎన్నిక జరిగినా కూటమి సునాయాశంగా విజయం సాధిస్తోంది. ప్రధానంగా వైసీపీకి బలం ఉన్న చోటా టీడీపీ కూటమినే జయకేతనం ఎగురవేయడం ఆసక్తికరంగా మారుతోంది. తాజాగా జరిగిన పది పట్టణ స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో హిందుపురం మున్సిపాలిటీతోపాటు తిరుపతి, నెల్లూరు, ఏలూరు కార్పొరేషన్లలోను నందిగామ, నూజివీడు వంటి మున్సిపాలిటీలు టీడీపీ కూటమి ఖాతాలోకి వెళ్లాయి. వాస్తవానికి ఈ అన్ని మున్సిపల్, నగర పాలక సంస్థల్లో సంఖ్యాపరంగా వైసీపీకే ఎక్కువ బలం ఉంది. కానీ, కూటమి గెలవడమే ఇక్కడి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సివస్తోంది. ప్రత్యేక వ్యూహం ఏమైనా ఉందా? అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత పార్టీపై ఫోకస్ చేయాల్సిన వైసీపీ అధిష్ఠానం ఆ పని గాలికి వదిలేసిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తాజాగా ఎదురైన పరాజయాలను విశ్లేషిస్తే అన్నిచోట్లా వైసీపీ నుంచి ఫిరాయించిన నేతలే ఆ పార్టీ అభ్యర్థులను ఓడించారు. అధికార కూటమిని గెలిపించారు. నాలుగేళ్ల క్రితం తాము గెలిపించామని చెప్పుకున్న కౌన్సిలర్లు, కార్పొరేటర్లు ఇప్పుడు పార్టీకి హ్యాండివ్వడం చర్చనీయాంశమవుతోంది. 2021 మార్చిలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రం మొత్తం చుట్టేసిన వైసీపీ.. ఇప్పుడు ఖాళీ అయిన స్థానాలను కాపాడుకోలేని దుస్థితికి చేరుకోవడం ఆ పార్టీ వైఫల్యంగా చెబుతున్నారు. గతంలో చూపిన బలం ఇప్పుడు ఏమైందనే ప్రశ్న తలెత్తుతోంది. నాలుగేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో అధికార బలంతో గెలిపించుకుంటే... ఇప్పుడు అదే అధికార బలం టీడీపీ కూటమికి ఉండటం వల్ల అటువైపు విజయాలు నమోదవుతున్నట్లు విశ్లేషిస్తున్నారు. వాస్తవానికి వైసీపీలో స్థానిక నేతలు ఇళ్ల నుంచి బయటకు రాకపోవడమే అన్నిచోట్ల పరాజయం పాలవ్వాల్సివచ్చిందని అంటున్నారు. ముఖ్యంగా ఏలూరు, నెల్లూరు కార్పొరేషన్లలో వైసీపీ నేతలు పత్తా లేకపోవడంతో ఆ కార్పొరేషన్లు టీడీపీ ఖాతాలో చేరాయి. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా మండవ కృష్ణకుమారి ఎన్నికయ్యారు. ఛైర్‌పర్సన్ ఎన్నిక సందర్భంగా పట్టణంలోని జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎక్స్ అఫీషియో సభ్యురాలు, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యతో పాటు 18 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. ఈ క్రమంలో నిర్వహించిన ఎన్నికలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యతో కలిపి కృష్ణకుమారికి 15 మంది మద్దతు లభించింది. వైకాపా అభ్యర్థి ఓర్సు లక్ష్మికి కేవలం ముగ్గురే మద్దతు తెలిపారు. దీంతో ఛైర్‌పర్సన్‌గా కృష్ణకుమారి ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. ధ్రువీకరణ పత్రాన్ని ఎన్నికల ప్రత్యేకాధికారి, ఆర్డీవో బాలకృష్ణ ఆమెకు అందజేశారు. 2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వైకాపా-13, తెదేపా-6, జనసేన-1 చొప్పున గెలిచారు.అదేవిధంగా గుంటూరు కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీల ఎన్నిక సమయంలోనూ టీడీపీ నేతల చాణక్యం ఫలించిందని చెబుతున్నారు. నూజివీడులో మంత్రి పార్థసారధి, నందిగామలో ఎమ్మెల్యే సౌమ్య దగ్గరుండి తమ పార్టీ అభ్యర్థులను గెలిపించుకున్నారు. ఇదే సమయంలో ఒక్క తిరుపతిలో తప్ప మరెక్కడా వైసీపీ నేతలు కనిపించలేదు. ప్రస్తుత రాజకీయ పరిణామాలు వైసీపీకి ఓ గుణపాఠంగా చెబుతున్నారు. మరో ఏడాదిలో జరిగే ఎన్నికలకు ఇవి రిహార్సల్ అనుకుంటారో? లేక అధికారానికి తలొగ్గేస్తారో చూడాలని చర్చ జరుగుతోంది.

# నేషనల్ డిగ్రీ కళాశాలలో క్యాన్సర్ పై అవగాహన సదస్సు

**-అవగాహన, ఆహారపు అలవాట్ల మార్పు ద్వారా క్యాన్సర్ ను నియంత్రించవచ్చు.**

**-రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాన్సర్ అవగాహన సదస్సు లో డా.సహదేవుడు.**

**-ఆత్మవిశ్వాసం, మనోధైర్యం , సరైన చికిత్స ద్వారా క్యాన్సర్ ను ఎదుర్కోవచ్చు మారుతి కుమార్.**





ఫిబ్రవరి 04ఆంధ్ర ప్రగతి
ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా స్థానిక నేషనల్ డిగ్రీ కళాశాలలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నంద్యాల జిల్లా బ్రాంచ్ ఆధ్వర్యంలో క్యాన్సర్ పై అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందని రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి పర్ల తెలిపారు. నేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ సదస్సులో ప్రముఖ సీనియర్ వైద్యులు డా.గెలివి సహదేవుడు గారు పిపిటి స్లైడ్స్ ద్వారా వివిధ రకాల క్యాన్సర్ ఛాయా చిత్రాలను చూపిస్తూ అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో క్యాన్సర్ జయించిన రెడ్ క్రాస్ వైస్ చైర్మన్, సెవెన్ హిల్స్ హాస్పిటల్ అధినేత మారుతి కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొనగా సుమారు 400 మంది విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు రెడ్ క్రాస్ డీప్ఓ అబ్దుస్ సమి తదితరులు పాల్గొన్నారు. డా.సహదేవుడు మాట్లాడుతూ పిల్లలకు తల్లిపాలు ఇవ్వని మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంటుందని, అలాగే పొగాకు, గంజాయి, డ్రగ్స్, ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్ ల, ప్లాస్టిక్ కారకాల ద్వారా, ఒత్తిడి వల్ల కూడా వస్తుందని, సరైన చికిత్స, అవగాహన, ఆత్మవిశ్వాసం ద్వారా దీన్ని జయించవచ్చని వివరించారు. బాలికలకు హెచ్ పి వి హ్యూమన్ హ్యూమన్ పాపిలోమా వైరస్ వ్యాక్సిన్ వేయించడం ద్వారా మహిళల్లో వచ్చే గర్భాశయ క్యాన్సర్ ను నియంత్రణ చేయొచ్చని వివరించారు. క్యాన్సర్ ను జయించిన రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ మారుతి కుమార్ మాట్లాడుతూ తన అనుభవాలను, బాధలను, ఆత్మవిశ్వాసం తో కోలుకున్న విధానాన్ని ,ఆత్మవిశ్వాసం మనోధైర్యం తో దేన్నైనా జయించవచ్చని విద్యార్థులకు వివరించారు.నేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ గారు మాట్లాడుతూ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా క్యాన్సర్ పై అవగాహన కల్పించిన డా.సహదేవుడు కి, సదస్సు ఏర్పాటు చేసిన రెడ్ క్రాస్ సొసైటీ వారికి ధన్యవాదాలు తెలిపారు.



# యధాతథంగా పాతపన్ను విధానం

## రద్దు చేసే ఆలోచన లేదన్ననిర్మలా సీతారామన్




**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 04ఆంధ్ర ప్రగతి :** యధాతథంగా పాతపన్ను విధానం ఉంటుందని, దానిని రద్దు చేసే ఆలోచన లేదని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. కొత్త పన్ను విధానాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన నేపథ్యంలో పాత పన్ను విధానాన్ని రద్దు చేస్తారన్న ప్రచారం నేపథ్యంలో దీనిపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. పాత పన్ను విధానం రద్దు చేసే ఆలోచన లేదని స్పష్టం చేశారు. ఇండియాటుడే- బిజినెస్‌టుడే నిర్వహించిన 2025 రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న సందర్భంగా దీనిపై మాట్లాడారు. 'పన్ను చెల్లింపుదారులందరూ కొత్త పన్ను విధానంలోకి మారాలని మీరు భావిస్తున్నారా?' అంటూ ఎదురైన ప్రశ్నకు నిర్మలా సీతారామన్ స్పందిస్తూ.. పాత పన్ను విధానం రద్దు చేయాలన్న ప్రతిపాదన తమ వద్ద లేదన్నారు. పన్ను ఫైలింగ్ విధానం సరళంగా ఉండాలనే ఉద్దేశంతో కొత్త పన్ను విధానం తీసుకొచ్చినట్లు చెప్పారు. కొత్తగా తీసుకురాబోయే ఆదాయపు పన్ను చట్టం గురించి కూడా ఈ సందర్భంగా ప్రస్తావన వచ్చింది. 1961లో తీసుకొచ్చిన పాత ఆదాయపు పన్ను చట్టం స్థానంలో అనేక మార్పులు, చేర్పులతో కొత్త ఆదాయపు పన్ను చట్టాన్ని ప్రవేశపెట్టనున్నట్టు వెల్లడించారు. మరికొద్ది రోజుల్లో ప్రవేశపెట్టబోయే ఈ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందుతుందని భావిస్తున్నట్లు ఆమె తెలిపారు.

# నేడు ప్రయాగ్‌రాజ్‌కు ప్రధాని

## త్రివేణి సంగమంలో స్నానం ఆచరించనున్న మోడీ



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 04ఆంధ్ర ప్రగతి**

ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళాలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ బుధవారం పాల్గొనన్నారు. ఆయన త్రివేణీ సంగమంలో పుణ్యస్నానం ఆచరించనున్నట్లు సమాచారం. ఈమేరకు ప్రధాని షెడ్యూల్‌ను ఓ సీనియర్ ఐపీఎస్ అధికారి చెప్పినట్లు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. 'బుధవారం ఉదయం 10 గంటలకు ప్రధాని ప్రయాగ్‌రాజ్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి ఉదయం 10.45 గంటలకు అరైల్ ఘాట్‌కు వెళ్తారు. ఘాట్ నుంచి బోటులో ప్రయాణించి మహాకుంభమేళా జరుగుతున్న ప్రాంతానికి చేరుకుంటారు. ఉదయం 11 నుంచి 11.30 గంటల మధ్య త్రివేణీ సంగమంలో ప్రధాని పుణ్యస్నానం ఆచరిస్తారు. 11.45 గంటలకు బోటులో తిరిగి అరైల్ ఘాట్‌కు వెళ్తారు. అక్కడి నుంచి ప్రయాగ్‌రాజ్ ఎయిర్‌పోర్టుకు వెళ్లి దిల్లీ బయల్దేరుతారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని ఎలాంటి కార్యక్రమాల్లో పాల్గొనబోరని తెలుస్తోంది. కేవలం పుణ్యస్నానం ఆచరించి గంగానదికి పూజలు చేయనున్నారని సమాచారం. దాదాపు గంటన్నర పాటు మోదీ ప్రయాగ్‌రాజ్‌లో ఉండనున్నారు. ఈ క్రమంలోనే నగరంతో పాటు కుంభమేళా వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. ప్రధాని వెంట యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పాల్గొంటారు. మహా కుంభమేళా ప్రారంభానికి ముందు ప్రధాని మోదీ ప్రయాగ్‌రాజ్ వెళ్లిన సంగతి తెలిసిందే. రూ.5500 కోట్లతో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. 144 ఏళ్లకోసారి వచ్చే జనవరి 13న కుంభమేళా ప్రారంభం కాగా.. ఫిబ్రవరి 26వ తేదీ వరకు కొనసాగనుంది. ఇప్పటికే దాదాపు 35 కోట్లకు పైగా భక్తులు కుంభమేళాకు వెళ్లి పుణ్యస్నానాలు ఆచరించారు.

--------------------

# చైనా దురాక్రమణలో భారత్ భూభాగాలు

## రాహుల్ వ్యాఖ్యలపై మండిపడ్డ రాజ్‌నాథ్ సింగ్

**న్యూఢిలీఫిబ్రవరి 04ఆంధ్ర ప్రగతి** సరిహద్దులో చైనా దురాక్రమణ అంటూ..లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ మండిపడ్డారు. భారత్- చైనా సరిహద్దు పరిస్థితి గురించి ఆర్మీ చీఫ్ చేసిన ప్రకటనపై రాహుల్ వ్యాఖ్యలు చేయడంపై ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నేత తప్పుడు ఆరోపణలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత్-చైనా సరిహద్దు పరిస్థితి గురించి ఆర్మీ చీఫ్ చేసిన ప్రకటనపై రాహుల్ గాంధీ పార్లమెంటు ప్రసంగంలో తప్పుడు ఆరోపణలు చేశారంటూ రాజ్‌నాథ్ సింగ్ మండిపడ్డారు. ఆర్మీ చీఫ్ వ్యాఖ్యలను తప్పుగా ప్రచారం చేస్తున్నారు. జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై ఆయన బాధ్యతారహిత రాజకీయాలకు పాల్పడడం విచారకరం. ఆయన చరిత్రపై అవగాహన పెంచుకోవాలని అంటూ 'ఎక్స్' వేదికగా విమర్శించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంలో రాహుల్ గాంధీ.. భారత్ భూభాగాలు, మేకిన్ ఇండియా గురించి ప్రస్తావించారు. 'చైనా బలగాలు మన భూభాగంలో ఉన్నాయనే విషయాన్ని ప్రధాని మోదీ ఖండించారు. దీనిపై ఆర్మీ చీఫ్ వాస్తవం మాట్లాడారు. చైనా బలగాలు మన భూభాగంలో ఉన్నాయని ఆయన అన్నారు' అని రాహుల్ అన్నారు. అదే విధంగా తయారీ రంగంలో భారత్ కంటే చైనా పదేళ్లు ముందుందన్నారు. ఆ దేశానికి చెందిన మోటార్లు, బ్యాటరీలు, ఆప్టిక్స్‌ల దిగుమతులపై ఇప్పటికీ భారత్ ఆధారపడటాన్ని ఆయన తప్పుబట్టారు. ప్రధాని మోదీచేపట్టిన 'మేకిన్ ఇండియా' విఫలం కావడం వల్లే బీజింగ్ నుంచి వస్తువులు దేశంలోకి వస్తున్నాయని ఆయన ఆరోపించారు.

# ఘనంగా రథసప్తమి వేడుకలు

**అమరావతి,ఫిబ్రవరి 04ఆంధ్ర ప్రగతి**

రథసప్తమి పర్వదినం సందర్భంగా శ్రీకాకుళం, అరసవెల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం తెల్లవారుజామున వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వినయ్ చంద్ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు స్వామివారి నిజరూప దర్శనం చేసుకున్నారు. అనంతరం కేంద్రమంత్రి మీడియాతో మాట్లాడుతూ.. తెలుగు ప్రజలకు రథసప్తమి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటిసారి రాష్ట్ర పండుగగా రథసప్తమి వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు జిల్లాపై ఉన్న అభిమానంతో ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. భక్తుల సౌకర్యార్థం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసామన్నారు. మంగళవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్వామివారి నిజరూప దర్శనం భక్తులకు కల్పిస్తున్నారని, ఆదిత్యుడి దర్శనం కోసం సోమవారం రాత్రి నుంచే ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారని.. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయన్నారు. మూడు రోజుల పాటు జరుగుతున్న ఉత్సవాలతో శ్రీకాకుళం పట్టణానికి కొత్త శోభ వచ్చిందని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. ఆరోగ్య ప్రదాత దర్శనం కోసం వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తున్నారన్నారు. ఆలయం అభివృద్ధికి చర్యలు చేపట్టామని, కేంద్ర ప్రభుత్వంతో చర్చించి అరసవెల్లి ఆలయాన్ని





ప్రసాదం స్కీమ్‌లో చేరుస్తామని చెప్పారు. సూర్య భగవానుని ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ప్రాచీన దేవాలయాలను కాపాడుకోవాలి అన్నదే ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు. శ్రీకాకుళం జిల్లా చరిత్రలో ఎప్పుడూ జరగని విధంగా కార్యక్రమం చేయాలనే ఆలోచనతో పకడ్బంధిగా చేశామని చెప్పారు.కాగా అరసవల్లి సూర్యనారాయణ స్వామి నిజరూప దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. ప్రభుత్వ చేసిన ఏర్పాట్లపై వారు ఆనందం వ్యక్తం చేశారు. స్వామివారిని గాయని మంగ్లీ, ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, మామిడి గోవిందరావు తదితరులు దర్శించుకున్నారు. కాగా తిరుమలలో రథసప్తమి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. రథసప్తమి సందర్భంగా మంగళవారం సప్త వాహనాలపై కోనేటిరాయుడు భక్తులకు దర్శనమివ్వనున్నారు. వాహనసేవలను తిలకించెందుకు వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకొని టీటీడీ అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. గ్యాలరీలలో వేచి వుండే భక్తులు ఇబ్బందులు పడకుండా తిరు వీధుల్లోని గ్యాలరీల్లో జర్మన్ షెడ్లు ఏర్పాటు చేశారు. గ్యాలరీల్లో నిరంతరాయంగా భక్తులకు అన్నపానీయాల సరఫరాకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గ్యాలరీల్లోకి చేరుకోలేని భక్తులు.. వాహనసేవలను తిలకించేందుకు తిరుమాడ వీధులకు వెలుపల అధికారులు ఎల్‌ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేశారు.

# ఫిబ్రవరి 10 వ తేదీన జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం

## 1-19 సంవత్సరాల లోపు విద్యార్థులందరూ తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలు వేసుకునేలా చూడాలి

## జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా





**కర్నూలు,ఫిబ్రవరి 04ఆంధ్ర ప్రగతి**

విద్యార్థులందరూ తప్పనిసరిగా నులి పురుగులు నివారించే అల్బెండజోల్ మాత్రలు వేసుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమంలో భాగంగా జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల ఫిబ్రవరి 10వ తేదీన జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా 1-19 సంవత్సరాల లోపు విద్యార్థులందరి చేత నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలని సంబంధిత విద్యాశాఖల అధికారులు, ఐసిడిఎస్ పిడి ని ఆదేశించారు..1886 అంగన్వాడీ కేంద్రాలు, 2231 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, 103 జూనియర్ కళాశాలలు, 22 ఐటిఐ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులందరిచేత ఆల్బెండజోల్ మాత్రలు వేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులు కూడా వేసుకునేలా చర్యలు తీసుకోవాలని సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు.. ఫిబ్రవరి 10 వ తేదీన మండల స్పెషల్ ఆఫీసర్లు, మునిసిపల్ కమిషనర్లు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కలెక్టర్ ఆదేశించారు..రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకు ఒక సారి 1సం. నుండి 19 సం.ల లోపు చిన్నారులకు, విద్యార్థులకు తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలను అందజేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు..1సం. నుండి 2సం.లు ఉన్న చిన్నారులకు సగం మాత్ర, 3సం.ల నుండి 19సం.ల ఉన్న వారికి ఒక మాత్ర వేసుకోవాలన్నారు. నులిపురుగులు శరీరంలో ఉండడం వల్ల చదువులో ఏకాగ్రత లోపించడం, రక్తహీనత, ఆకలి లేకపోవడం, బలహీనత, కడుపునొప్పి, వికారం, విరోచనాలు, బరువు తగ్గడంతో పాటు అనేక రకాల అనారోగ్య సమస్యలు కూడా వస్తాయన్నారు. విద్యార్థులు ఈ మాత్రలు తీసుకోవడం వల్ల శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా అల్బెండజోల్ మాత్రలను పిల్లలకు పంపిణీ జరుగుతుందని, ఒక వేళ ఈ రోజున మాత్రలు వేసుకోని పక్షంలో మళ్ళీ మాప్ అప్ కార్యక్రమం ద్వారా ఈనెల 17వ తేదీన అల్బెండజోల్ మాత్రలను అందజేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్వో వెంకట నారాయణమ్మ, డిఎంహెచ్ఓ డా.శాంతి కళ, సంబధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇది ప్రజాస్వామ్య ఓటమి

## టీటీడీ డిప్యూటీ మేయర్ ఎన్నికపై రోజా ఎమ్మెల్యే మండిపాటు

**అమరావతి,ఫిబ్రవరి 04ఆంధ్ర ప్రగతి**

తిరుపతి మున్సిపల్ డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో వైసీపీ ఓటమిపై రోజా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉప మేయర్ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి ఓటమిని ప్రజాస్వామ్య ఓటమిగా మాజీ మంత్రి ఆర్కే రోజా అభివర్ణించారు. తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ డా. శిరీషని విధుల నిర్వహణలో అవమానించారని ఆమె మండిపడ్డారు. తిరుపతి కార్పొరేషన్ సమావేశం లోపల జరుగుతుంటే బయట మేయర్ శిరీష ఆందోళన చేసే పరిస్థితి దేనికి సంకేతమని ప్రశ్నించారు. తిరుపతి ఎంపి గురుమూర్తి ప్రయాణిస్తున్న బస్సు పై దాడి చేశారని.. నిన్న బస్సులో బయలుదేరిన వైసీపీ కార్పొరేటర్లు ఇవాళ రాలేదన్నారు. మాతో నిన్న వచ్చి నేడు ఎన్నికల్లో మాకు వ్యతిరేకంగా ఓటు వేయడం నిన్న రాత్రి జరిగిన పరిణామాలకు కొనసాగింపు కాదా అని ప్రశ్నించారు. మున్సిపల్ కార్పొరేషన్ లో ఒక్క ఓటు ఉన్న టీడీపీ కార్పొరేటర్ తిరుపతి డిప్యూటీ మేయర్‌గా గెలిచారన్నారు. వైసీపీ విప్ జారీ చేసింది. రిటర్నింగ్ అధికారి మా సభ్యులు విప్ దిక్కరించిన కారణంగా కార్పొరేటర్లను అనర్హులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కానీ అవేమీ జరగలేదని, జరిగిన పరిస్థితిని గమనిస్తే తిరుపతిలో ఎన్నికలు ఎంత ప్రజాస్వామ్య బద్ధంగా జరిగాయో అందరికీ అర్థమవుతుందని ఆర్కే రోజా మండిపడ్డారు. మేము ఓడి గెలిచాం, టీడీపీ వాళ్లు గెలిచి ఓడిపోయారు. అంతిమంగా ఒకటే చెపుతున్నా.. ఇక్కడ మేం ఓడిపోలేదు.. వ్యవస్థల ఉదాసీన వైఖరి, అధికార దుర్వినియోగం తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో గెలిచాయని ఆర్కే రోజా స్పష్టం చేశారు. తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి వారితోపాటు రాష్ట్ర ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారు. సమయం వచ్చినప్పుడు వారే దీనికి సమాధానం చెపుతారని ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. వైసీపీ కార్పొరేటర్ లడ్డూ భాస్కర్ తరపున మేయర్ డాక్టర్ శిరీష, కార్పొరేటర్ రాధాకృష్ణ ప్రతిపాదించారు. టీడీపీ అభ్యర్థి మునికృష్ణ తరపున ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కార్పొరేటర్ అన్నై అనిత ప్రతిపాదన చేశారు. మంగళవారం ఉదయం నిర్వహించిన ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థికి 21 ఓట్లు పడగా... టీడీపీ అభ్యర్థి మునికృష్ణకు 26 ఓట్లు వచ్చాయి. దాంతో తిరుపతిలో ఏకైక టీడీపీ కార్పొరేటర్ గా ఉన్న ఆర్సీ మునికృష్ణ ఇప్పుడు తిరుపతి డిప్యూటీ మేయర్ గా విజయం సాధించారు.

# నేనే మిమ్మలను కలుసుకుంటా

## నన్ను కలిసేందుకు ఎవరూ రావద్దు అభిమానులకు నటుడు జూనియర్ ఎన్టీఆర్ వినతి

**హైదరాబాదఫిబ్రవరి 04ఆంధ్ర ప్రగతి** తనపై అభిమానులు చూపిస్తున్న ప్రేమకు ఎన్టీఆర్ (ఔ÷ఖీ) కృతజ్ఞతలు తెలిపారు. తనను కలుసుకోవడానికి పాదయాత్రల్లాంటివి చేయొద్దని వారికి విజ్ఞప్తి చేశారు. వారి ఆనందమే కాదు సంక్షేమం కూడా తనకు ముఖ్యమన్నారు. తనను కలుసుకోవాలని ఎదురుచూస్తున్న అభిమానుల ఆసక్తిని అర్థం చేసుకుని.. త్వరలో వారి కోసం ఓ సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆ సమావేశానికి సంబంధించి పోలీసుల అనుమతి, అధికారులతో సమన్వయం, శాంతి భద్రతల సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఇందుకు కొంత సమయం పడుతుందని, అప్పటి వరకు అభిమానులు ఓపికగా ఉండాలని ఎన్టీఆర్ కోరారు. సంబంధిత స్టేట్‌మెంట్‌ను ఎన్టీఆర్ టీమ్ విడుదల చేసింది. కుప్పం నుంచి పాదయాత్ర చేసి హైదరాబాద్‌లో పలువురు ఫ్యాన్స్ ఎన్టీఆర్‌ను ఇటీవల కలిసిన సంగతి తెలిసిందే. సినిమాల విషయానికొస్తే.. 'దేవర'తో గతేడాది విజయాన్ని అందుకున్న ఎన్టీఆర్ ప్రస్తుతం 'వార్ 2'తో బిజీగా ఉన్నారు. ఇందులో హృతిక్ రోషన్ మరో హీరో. 'కేజీయఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్‌తో ఎన్టీఆర్ ఇప్పటికే ఓ సినిమా



ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ యాక్షన్ మూవీకి 'ఎంటర్ ది డ్రాగన్', 'ఎన్టీఆర్ ది డ్రాగన్' లాంటి పేర్లను టైటిల్‌గా పెట్టే ఆలోచనలో చిత్ర బృందం ఉందని ఇటీవల వార్తలొచ్చాయి. ఇందులో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా ఎంపికైనట్టు సమాచారం. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ సినిమాని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# దివాన్ చెరువు రిజర్వ్ ఫారెస్ట్‌లో భారీ అగ్నిప్రమాదం

**రాజమండ్రి,ఫిబ్రవరి 04ఆంధ్ర ప్రగతి** :రాజమండ్రి సమీపంలోని దివాన్ చెరువు రిజర్వ్ ఫారెస్ట్ లో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. రాజమండ్రి నుంచి రాజానగరం వెళ్లే జాతీయ రహదారి పక్కన మంటలు భారీగా వ్యాపించడంతో.. ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున పొగ వ్యాపించింది. ఇక, చక్రద్వారా బంధం గ్రామ సమీపంలో మంటలు వ్యా?ప్తి చెందడంతో.. గ్రామస్తులతో పాటు రైతులు తీవ్ర భయాందోళ వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంపై అగ్నిమాపక సిబ్బందితో పాటు అటవీ శాఖ అధికారులకు స్థానికులు సమాచారం అందించగా.. రంగంలోకి దిగిన ౖ÷ర్ డిపా÷-టం÷-మెంట్ మంటలను అదుపులోకి తీసుకొచ్చింది. అయితే, రిజర్వ్ ఫారెస్ట్ లో అగ్ని ప్రమాదం జరిగినట్లు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కి తెలియడంతో.. హూటాహూటీన ఆ ప్రాంతానికి వెళ్లి చెట్లు దగ్ధమైన ప్రదేశాన్ని పరిశీలించారు. ఇక, అగ్ని ప్రమాదానికి గల కారణాలను ఫారెస్ట్ అధికారులను అడిగి తెలుసుకున్నారు మంత్రి. ఇది మానవ తప్పిదంగా జరిగిన ప్రమాదంగా భావిస్తున్నామని ఆయన అన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిర్వహిస్తున్న అటవీ శాఖలో ఇటువంటి ప్రమాదాలు మరోసారి పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని తేల్చి చెప్పారు. రాజమండ్రి నగరానికి ఆనుకుని ఉన్న అటవీ భూముల్లో అగ్ని ప్రమాదం జరగడంపై అధికారులు వెంటనే స్పందించారు.. లేకపోతే పెను ప్రమాదం జరిగేదాని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.

# ఎస్సీ వర్గీకరణ అమలుకు కట్టుబడి ఉన్నాం

**ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో ప్రకటన**
**కమిషన్ నివేదిక మేరకు రిజర్వేషన్ల అమలు**
**తనజీవితంలో చరిత్రలో నిలిచిచిపోయే రోజు**
**అసెంబ్లీలో ప్రకటన చేసిన సిఎం రేవంత్ రెడ్డి**





**హైదరాబాద్,ఫిబ్రవరి 04ఆంధ్ర ప్రగతి**
ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కోర్టు తీర్పు అమలు కోసం ఏకసభ్య కమిషన్ వేశామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రకటన చేశారు. వర్గీకరణ చేయాలని ఏకసభ్య కమిషన్ సిఫారసు చేసింది. కమిషన్ పలు జిల్లాల్లో పర్యటించి సమగ్ర నివేదిక రూపొందించింది. నేరుగా ప్రజలను కలుసుకుని విజ్ఞప్తులు సేకరించింది. మరికొందరు కమిషన్‌కు ఆన్‌లైన్ ద్వారా విజ్ఞప్తులు అందించారు. 82 రోజుల్లో కమిషన్ తన నివేదికను అందించింది. 15 శాతం ఎస్సీ రిజర్వేషన్లను 3 గ్రూపులకు పంచుతూ కమిషన్ సిఫారసు చేసింది. ఎస్సీల్లో మొత్తం 59 ఉప కులాలను గ్రూప్-1, 2, 3గా వర్గీకరించాలని కమిషన్ సిఫారసు చేసింది.గ్రూప్-1లోని 15 ఉపకులాలకు 1 శాతం రిజర్వేషన్ (జనాభా 3.288 శాతం), గ్రూప్-2లోని 18 ఎస్సీ ఉపకులాలకు 9శాతం రిజర్వేషన్ (జనాభా 62.74 శాతం), గ్రూప్-3లోని 26 ఉప కులాలకు 5శాతం రిజర్వేషన్ (జనాభా 33.963శాతం) కల్పించాలని వర్గీకరణ కమిషన్ తన నివేదికలో పేర్కొంది. ఎస్సీ కులాల గ్రూప్‌లకు రోస్టర్ పాయింట్లు, క్రిమీలేయర్ విధానాన్ని కూడా అమలు చేయాలని కమిషన్ సిఫారసు చేసింది. ఎస్సీ వర్గీకరణ, కులగణన.. నా రాజకీయ జీవితంలో అత్యంత సంతృప్తినిచ్చిన అంశాలు. నా రాజకీయ జీవితంలో ప్రత్యేకంగా గుర్తుండి పోతుందని సిఎం రేవంత్ అన్నారు.

ఎందరో ముఖ్యమంత్రులకు రాని అవకాశం నాకు వచ్చింది. చాలా రాజకీయ పార్టీలు ఎస్సీ వర్గీకరణ అంశాన్ని ఓటు బ్యాంకుగా చూశాయి తప్ప.. ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించే ప్రయత్నం చేయలేదు. అందుకే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడం ద్వారా సమాజంలో తరతరాలుగా నిర్లక్ష్యానికి, దోపిడీకి గురైన వారికి న్యాయం చేయాలని సంకల్పించాం. వర్గీకరణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరుతున్నా అని రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. 30, 40 ఏళ్ల నాటి ఆకాంక్ష నేడు సాకారం అవుతోందని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఎస్సీ వర్గీకరణ వల్ల కొందరిలో భయం, అభద్రతాభావం కలుగుతోంది. వర్గీకరణ వల్ల ఎవరి ప్రయోజనాలకు విఘాతం కలగదు. అంటరానితనం అనేది ప్రపంచం అంతటా ఉంది. ఎంత చదువుకున్నా.. ఎంత ఎదిగినా.. ఎక్కడో ఒకచోట వివక్ష ఎదుర్కోవాల్సి వస్తుంది. గాంధీజీ, అంబేద్కర్ వంటి మహనీయులకు కూడా వివక్ష తప్పలేదు. సామాజిక న్యాయం ఎక్కువగా కల్పించింది కాంగ్రెస్ పార్టీయే. 50 ఏళ్ల క్రితమే దళితనేత దామోదరం సంజీవయ్యను ఉమ్మడి రాష్ట్రానికి సీఎంను చేసింది కాంగ్రెస్ పార్టీ. జగ్జీవన్‌రామ్, దామోదరం సంజీవయ్య వంటి వారికి ఉన్నత పదవులు ఇచ్చింది. సామాజిక ఫలాలు అందరికీ అందాలనేది కాంగ్రెస్ పార్టీ తపన. ఎస్సీ వర్గీకరణ నిర్ణయం రాజకీయ కారణాలతో తీసుకోలేదు. క్షేత్ర స్థాయిలో పరిస్థితులను అధ్యయనం చేసి తీసుకున్న నిర్ణయం ఇది. ప్రభుత్వానికి సంబంధం లేకుడా కమిషన్ అధ్యయనం చేసి నివేదిక ఇచ్చింది. ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఉంటుందని ఏఐసీసీ ఎప్పుడో చెప్పిందని పేర్కొన్నారు. 30 ఏండ్ల ఉద్యమానికి ఈ రోజు పరిష్కారం దొరికిందని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఎస్సీ వర్గీకరణ రిపోర్ట్ పై అసెంబ్లీలో తీర్మానం సందర్భంగా మాట్లాడిన ఆయన.. వర్గీకరణ ఏ వర్గానికి వ్యతిరేకం కాదన్నారు. సామాజిక న్యాయం అంబేద్కర్ కల అని చెప్పారు. ఇది మా ఏండ్ల నాటి కల అని అన్నారు. దేశంలో ఎస్సీలను ఏనాడు మనుషులుగా చూడలేదన్నారు. ఓ దళితున్ని పార్టీ అధ్యక్షుడిగా చేసింది కాంగ్రెస్ పార్టీనే అని కొనియాడారు.

# పార్టీ ఫిరాయించిన ఎంఎల్‌ఎలకు నోటీసులు

**సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నోటీసులు**



**హైదరాబాద్,ఫిబ్రవరి 04ఆంధ్ర ప్రగతి** పార్టీ మారిన ఎమ్మెల్యేకు షాక్ తగిలింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ అయ్యాయి. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేలకు అసెంబ్లీ కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. పార్టీ ఫిరాయింపులపై లిఖిత పూర్వక సమాధానం చెప్పాలని నోటీసుల్లో పేర్కొన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని సుప్రీంకోర్టును బీఆర్ఎస్ ఆశ్రయించిన విషయం తెలిసిందే. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై నాలుగు నెలల్లో చర్యలు తీసుకోవాలని గతంలోనే తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. అయినప్పటికీ ఎలాంటి పురోగతి లేకపోవడంతో బీఆర్ఎస్ పార్టీ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరిపై అనర్హత వేటు వేయాలంటూ ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ హైకోర్టులో పిటిషన్ వేసింది. ఎమ్మెల్యేలపై నాలుగు నెలల్లో చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించినప్పటికీ ఈ వ్యవహారం ముందుకు జరగలేదు. దీంతో బీఆర్ఎస్ పార్టీ సుప్రీంలో పిటిషన్ వేసింది. మొదట తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరి, దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ పిటిషన్ వేసింది. ఆ తరువాత మరొక ఏడుగురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని సుప్రీంకోర్టును ఆశ్రయించింది బీఆర్ఎస్. అయితే వీటన్నింటినీ కలిపి ఒకేసారి విచారణ చేస్తామంటూ.. ఈ కేసు విచారణను సుప్రీం కోర్టు ఈనెల 10కి వాయిదా వేసింది. ఓ వైపు కోర్టులో విచారణ జరుగుతుండగానే.. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌ను కూడా కోరింది బీఆర్ఎస్. దీనిపై స్పందించిన స్పీకర్.. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చారు. లిఖితపూర్వకంగా సమాధానాలు చెప్పాలంటూ నోటీసుల్లో పేర్కొన్నారు.

# కల్లుగీత కులాలకు హైకోర్టులో ఊరట

**మద్యం లైసెన్సుల కేటాయింపుపై స్టేకు నిరాకరణ**
**కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశం**




అమరావతి, ఫిబ్రవరి 4: కల్లుగీత కులాలకు మద్యం దుకాణాల లైసెన్స్ ఖరారు చేయకుండా నిలువరించాలంటూ మద్యం దుకాణాల యజమానులు చేసిన అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. అయితే, వారికి ప్రభుత్వం ఇచ్చే లైసెన్సులు తుదితీర్పునకు లోబడి ఉంటాయని స్పష్టం చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్రంలో 10శాతం మద్యం దుకాణాలను లైసెన్సింగ్ ఫీజులో 50శాతం రాయితీతో కల్లుగీత వర్గానికి కేటాయించడాన్ని సవాల్ చేస్తూ పలువురు మద్యం దుకాణాల యజమానులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు వేదుల వెంకటరమణ, ఒ.మనోహర్‌రెడ్డి తదితరులు వాదనలు వినిపించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 3,450 మద్యం దుకాణాల్లో 10శాతం(340) దుకాణాలను కల్లుగీత కులాలకు కేటాయించడం చట్టవిరుద్ధమన్నారు. కల్లుగీత కులాలకు లైసెన్స్ ఖరారు ప్రక్రియపై స్టే ఇవ్వాలని అభ్యర్థించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదిస్తూ.. పిటిషనర్లది ఆందోళన మాత్రమే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ వర్గాలు, కులాలను గుర్తించి వారికి రాయితీపై మద్యం దుకాణాలు కేటాయించేందుకు ఎక్సైజ్‌చట్టంలో వెసులుబాటు ఉందన్నారు. 2024లో తీసుకొచ్చిన మద్యం పాలసీలో గీత కార్మికులకు రాయితీపై 10శాతం షాపుల కేటాయింపు విషయం స్పష్టంగా ఉందని, అన్ని విషయాలు తెలుసుకొనే పిటిషనర్లు మద్యం దుకాణాల లైసెన్స్ వేలంలో పాల్గొన్నారని తెలిపారు. కల్లుగీత వర్గానికి 340 దుకాణాలు కేటాయించడం వల్ల 3000 మంది దుకాణాల యాజమానులకు నష్టం జరిగితే, వారి ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

# ఏఐ సెంటర్ మాకివ్వండి

**కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు లోకేశ్ వినతి**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 04ఆంధ్ర ప్రగతి**
బడ్జెట్‌లో ప్రకటించిన 'ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫర్ ఎడ్యుకేషన్'ను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖల మంత్రి లోకేశ్.. కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, రైల్వే శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. కృత్రిమ మేధ (ఏఐ)తో రాబోతున్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి రాష్ట్రం సిద్ధంగా ఉందని, ఇందుకు కేంద్రం చేయూతనివ్వాలని విన్నవించారు. విశాఖపట్నంలో తాము ఏర్పాటు చేసే డేటా సిటీకి సహకరించాలని కోరారు. మంగళవారమిక్కడ రైల్ భవన్‌లో కేంద్ర మంత్రితో సమావేశమయ్యారు. ఆయన్ను మంగళగిరి చేనేత శాలువాతో సత్కరించారు. రైల్వే బడ్జెట్‌లో రాష్ట్రానికి అత్యధికంగా కేటాయింపులు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, నూతన పాలసీల గురించి కేంద్ర మంత్రికి వివరించారు. ఏఐ విప్లవంతో డేటా సిటీలకు పెద్దఎత్తున డిమాండ్ రాబోతోందని.. కృత్రిమ మేధ రంగంలో వస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుంటూ డేటా సిటీల ఏర్పాటుకు అవసరమైన ప్రత్యేక పాలసీల రూపకల్పన, సింగిల్ విండో పద్ధతిలో కేంద్రం నుంచి అనుమతులు సులభతరం చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. 'డేటా సిటీలు, ఎలక్ట్రానిక్స్ కంపెనీల ఏర్పాటుతో ఏపీ యువతకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు వస్తాయి. 2047కి 30 ట్రిలియన్ డాలర్లకు దేశ ఆర్థిక వ్యవస్థ చేరాలన్నది ప్రధాని మోదీ లక్ష్యం. కేంద్ర సహకారంతో ఏఐ రంగంలో వచ్చే అవకాశాలను అందిపుచ్చుకుని వికసిత్ భారత్ లక్ష్యంలో ఏపీ భాగస్వామి అవుతుంది.
ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాం. రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్ కంపెనీల ఏర్పాటుకు కేంద్రం సహకరించాలి. ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో పెట్టుబడులు ఆకర్షించేందుకు త్వరితగతిన అనుమతులు ఇవ్వడమే కాకుండా.. ప్రాజెక్టులు త్వరితగతిన ఏర్పాటయ్యేవిధంగా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు చర్యలు తీసుకుంటున్నాం' అని లోకేశ్ తెలిపారు. కాగా.. మంగళగిరిలో ఎన్నో ఏళ్లుగా 800 నిరుపేద కుటుంబాలు నిరుపయోగంగా ఉన్న రైల్వే భూముల్లో నివసిస్తున్నారని.. మానవతా దృక్పథంతో ఆ భూములను రాష్ట్రప్రభుత్వానికి కేటాయించాలని కేంద్ర మంత్రిని కోరారు. వారికి అక్కడ శాశ్వత ఇళ్ల పట్టాలు అందజేస్తామని చెప్పారు.
కలిసికట్టుగా ఉండడం వల్లే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోగలిగామని, రాష్ట్రప్రయోజనాల విషయంలో ఇక ముందు కూడా ఇదే పంథా కొనసాగిద్దామని లోకేశ్ అన్నారు. ఢిల్లీలో కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాసవర్మ, టీడీపీ ఎంపీలు, బీజేపీ నేతలు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. 7 నెలల్లోనే సమష్టి కృషితో విశాఖ రైల్వే జోన్, అమరావతి, పోలవరం, స్టీల్ ప్లాంట్‌కు నిధులు తెచ్చుకోగలిగామని చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్ర మంత్రులు, ఎంపీలు చేస్తున్న కృషిని అభినందించారు. అతి తక్కువ కాలంలో విశాఖ స్టీల్ సహా అనే సమస్యలు పరిష్కారం కావడం తనకెంతో సంతోషాన్నిచ్చిందని చెప్పారు.

# తిరుమలలో వైభవంగా రథసప్తమి : స్వతవాహనసేవల్లో అనుగ్రహించిన శ్రీవారు

**తిరుమల,ఫిబ్రవరి 04ఆంధ్ర ప్రగతి** తిరుమలలో రథసప్తమి వేడుకలు వైభవంగా సాగాయి. దేవదేవుడిని దర్శించుకునేందుకు వేలాదిగా భక్తులు రతలి వచ్చారు. వామన సేవల్లో పాల్గొన్నారు. మాడవీధులు గోవింద నామస్మరణతో మారుమోగాయి. రథసప్తమి సందర్భంగా శ్రీనివాసుడు సప్తవాహనాల్లో భక్తులను అనుగ్రహించారు. సూర్యజయంతి సందర్భంగా సూర్యప్రభ వాహనంతో మొదలై చిన్నశేష, గరుడ, హనుమ, కల్పవృక్ష, సర్వభూపాల, చంద్రప్రభ వాహనాలపై ఒకేరోజు స్వామివారు అనుగ్రహించారు. అందుకే ఈ ఉత్సవాన్ని అర్ధ బ్రహ్మోత్సవం, మినీ బ్రహ్మోత్సవం, ఒకరోజు బ్రహ్మోత్సవంగా పిలుస్తుంటారు. సూర్యోదయం నుంచి చంద్రోదయం వరకు ఏడు వాహనాలపై స్వామివారిని వేంచేపు చేస్తారు. అత్యంత ప్రధానమైన రథసప్తమి వాహనసేవ సూర్యప్రభవాహనం. సర్వలోకాలకు చైతన్యాన్ని కలిగిస్తూ ఉదయించే శ్రీ సూర్య భగవానుడు తన ఉషారేఖలను ఉదయం 6.48 గంటలకు శ్రీవారి పాదాలపై ప్రసరింపచేశాడు. ఈ వాహన సేవను తిలకించేందుకు భక్తులు పోటెత్తారు. సూర్యుడు సకలరోగ నివారకుడు, ఆరోగ్యకారకుడు, ప్రకృతికి చైతన్య ప్రదాత. ఈ వాహనంలో శ్రీవారి చుట్టూ ఉన్న సూర్యప్రభ సకల జీవుల చైతన్య ప్రభ. సూర్యప్రభ వాహనంలో ఉండే స్వామిని దర్శించుకుంటే సత్సంతాన సంపదలు, ఆయురారోగ్యాలు, భోగభాగ్యాలు సిద్ధిస్తాయి. సూర్యప్రభ వాహనం తర్వాత ఉదయం 9 నుంచి 10 గంటల వరకు చిన్న శేషవాహనంపై శ్రీవారి చిద్విలాసాన్ని చూసి తరించారు భక్తులు. చిన్న శేషుడిని నాగలోకానికి రాజుగా భావిస్తారు. వైష్ణవ సంప్రదాయం అనుసరించి భగవంతుడు శేషి..ఈ ప్రపంచం శేషభూతం అని అర్థం. చిన్నశేష వాహనంపై శ్రీవారిని దర్శించుకుంటే కుటుంబ శ్రేయస్సు ఉంటుందని భక్తుల విశ్వాసం




రథ సప్తమి ఉత్సవాల్లో భాగంగా సూర్యప్రభ, చిన్న శేష వాహనం తర్వాత గరుడ వాహనంపై దర్శన మిచ్చారు మలయప్ప స్వామివారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు గరుడవాహనంపై శ్రీవారిని దర్శించుకున్నారు భక్తులు. జ్ఞానవైరాగ్యానికి రూపం అయిన రెక్కలతో విహరించే గరుడుడిపై కొలువైన మలయప్పస్వామిని దర్శించుకుంటే సకలపాపాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం రథసప్తమి ఉత్సవాల్లో భాగంగా నాలుగో వాహనసేవ హనుమంత వాహనం. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకూ మలయప్పస్వామి హనుమంతవాహనంపై మాడవీధుల్లో విహరించారు. భక్తులలో అగ్రగణ్యుడు అయిన ఆంజనేయుడు చతుర్వేద నిష్ణాతుడుగా, నవవ్యాకరణ పండితుడుగా, లంకాభీకరుడిగా ప్రసిద్ధి. హనుమంతవాహనంపై విహరించే మలయప్పస్వామి దర్శనం సకల భయాలను రూపుమాపి, ఆయురారోగ్యాలను ప్రసాదిస్తుంది. పౌరాణిక నేపథ్యంలో 108 వైష్ణవ దివ్యదేశాలలోనూ గరుడసేవ అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. గరుడవాహనం ద్వారా స్వామివారు దాసానుదాస ప్రపత్తికి తాను దాసుడని తెలియజెబుతారు. అంతేగాక జ్ఞానవైరాగ్య ప్రాప్తికోరే మానవులు జ్ఞానవైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే గరుడుని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని భక్తకోటికి తెలియజెబుతున్నాడు. రథసప్తమి సందర్భంగా మంగళవారం మధ్యాహ్నం 2 నుండి 3 గంటల మధ్య చక్రస్నానం వైభవంగా జరిగింది.శ్రీ వరాహస్వామివారి ఆలయం వద్ద గల స్వామిపుష్కరిణిలో చక్రత్తాళ్వార్లకు పాలు, పెరుగు, నెయ్యి, తెనె, చందనంతో అర్చకులు అభిషేకం నిర్వహించారు.ఈ వాహన సేవల్లో ఇక్ష జె శ్యామల రావు, అదనపు ఇక్ష సిహెచ్ వెంకయ్య చౌదరి, ఏఇక్ష శ్రీ వి వీరబ్రహ్మం, పాలకమండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ, పనబాక లక్ష్మీ, నన్నపనేని సదాశివరావు, జి.భానుప్రకాష్ రెడ్డి, ఇంఛార్జి అఃూక్ష మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# ఓటీటీలోకి 'గేమ్‌ఛేంజర్'..




గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్, ప్రముఖ దర్శకుడు శంకర్ కాంబినేషన్ లో వచ్చిన మూవీ 'గేమ్ ఛేంజర్'. ఈ సంక్రాంతి కానుకగా జనవరి 10న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ మిక్స్‌డ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఇప్పుడు ఈ సినిమా ఓటీటీలోకి వచ్చేస్తోంది. ఈ నెల 7 నుంచి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ కానుంది. తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ అవుతుందని అమెజాన్ తాజాగా సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. కాగా, మూవీ విడుదలైన 28 రోజుల్లోనే ఓటీటీలోకి రానుండటం గమనార్హం. కాగా, ఈ సినిమాలో తండ్రీకొడుకులుగా రామ్ నందన్, అప్పన్న పాత్రల్లో రామ్ చరణ్ అదరగొట్టారు. చరణ్ నటనకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి. ఇక చెర్రీకి జోడిగా బాలీవుడ్ నటి కియారా అద్వానీ నటించిన ఈ సినిమాను శ్రీవెంకటేశ్వర సినీ క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు భారీ బడ్జెట్‌తో నిర్మించారు. తమిళ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ ఈ మూవీకి కథను అందించగా.. సముద్రఖని, ఎస్‌జే సూర్య, శ్రీకాంత్, సునీల్, నవీన్ చంద్ర, అంజలి తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటించారు.



# పవర్‌ఫుల్ లుక్‌లో కీర్తి సురేష్ 'అక్క'

ఎవరిలో అయినా మార్పనేది సహజం. కెరీర్లో ఛాన్సుల కోసం చాలా మంది హీరోలు, హీరోయిన్లు తమను తాము మార్చుకుంటూ కెరీర్లో ముందుకు దూసుకెళ్తుంటారు. అయితే ఆ మార్పులు కొన్నిసార్లు అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తాయి. ఇప్పుడు కీర్తి సురేష్ కూడా తన కెరీర్లో అలాంటి మార్పే చేసింది. ఇంతవరకు క్యూట్ హీరోయిన్ గా కనిపించిన కీర్తి ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. బాలీవుడ్ కు ఎంట్రీ ఇచ్చాక కీర్తి పూర్తిగా గ్లామరస్ హీరోయినైపోయింది. రీసెంట్ గా బేబీ జాన్ సినిమాతో బాలీవుడ్ లోకి అడుగుపెట్టిన కీర్తికి ఆ సినిమా పెద్దగా విజయాన్ని ఇవ్వలేకపోయింది. ఇప్పుడు కీర్తి బాలీవుడ్ లో మొదటిసారి డిఫరెంట్ గా, పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనుంది. అమ్మడు ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్ కోసం ఓ వెబ్ సిరీస్ చేసింది. అక్క అనే వెబ్ సిరీస్‌లో పవర్‌ఫుల్ రోల్ లో కీర్తి కనిపించనుంది. ఇప్పటివరకు ఈ ప్రాజెక్ట్ కు సంబంధించి ఎక్కడా ఎలాంటి క్లూ కానీ, అప్డేట్ కానీ ఇవ్వకుండా సడెన్ గా ఈ ప్రాజెక్టుని అనౌన్స్ చేసింది నెట్ ఫ్లిక్స్. నెట్ ఫ్లిక్స్ తాజాగా తమ నుంచి రాబోతున్న కొన్ని ప్రాజెక్టులకు సంబంధించిన అప్డేట్స్ ఇవ్వగా అందులో కీర్తి సురేష్ అక్క ప్రాజెక్టు కూడా ఒకటిగా ఉంది. అక్క ప్రాజెక్టుని అనౌన్స్ చేస్తూ ఫస్ట్ లుక్ అంటూ ఓ గ్లింప్స్ ను రిలీజ్ చేసింది నెట్ ఫ్లిక్స్. ధర్మ రాజ్ శెట్టి ఈ సిరీస్‌కు దర్శకత్వం వహిస్తున్నాడు. గ్లింప్స్ చూస్తుంటే కీర్తి సురేష్ ఈ సిరీస్‌లో నెక్స్ట్ లెవెల్లో మెప్పించడం ఖాయమనిపిస్తుంది. అక్క అనే పవర్ కోసం కీర్తి సురేష్, రాధికా ఆప్టే మధ్య వార్ జరిగేలా ఉంది. అక్క సిరీస్ మొత్తం ఆడ సామ్రాజ్యమే అన్నట్టుగా గ్లింప్స్ చూస్తుంటే అర్ధమవుతుంది. గోల్డ్ స్మగ్లింగ్, ఆయుధాల అక్రమ రవాణా ప్రధానంగా తెరకెక్కనున్న ఈ గ్యాంగ్‌స్టర్ సిరీస్ ఎంగేజింగ్ డ్రామాలాగా అనిపిస్తుంది. ఈ గ్లింప్స్ లో కీర్తి లుక్స్, నడక, నడవడిక అన్నీ చాలా కొత్తగా ఉంటూనే ఇంప్రెస్ చేసేలా ఉన్నాయి. కీర్తి కళ్లలో ఆ పొగరు కూడా కనిపిస్తుంది. మరి అక్క తో అయినా కీర్తి బాలీవుడ్ లో హిట్ అందుకుంటుందేమో చూడాలి.

# సందీప్ రెడ్డి వంగా ఆఫీసులో మెగాస్టార్ ఫొటో.. నెట్టింట వైరల్






'అర్జున్ రెడ్డి' మూవీతో ఒక్కసారిగా అందరి దృష్టినీ ఆకర్షించిన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా. ఆ తర్వాత చేసిన రెండో సినిమా 'యానిమల్'తో దేశవ్యాప్తంగా ఆయన గుర్తింపు తెచ్చుకున్నారు. ఇక సందీప్ మెగాస్టార్ చిరంజీవి అభిమాని అనే విషయం తెలిసిందే. తాజాగా ఈ దర్శకుడు తన ఆఫీస్ తాలూకు ఫొటో ఒకటి ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పంచుకున్నారు. అందులో మెగాస్టార్ ఫొటోఫ్రేమ్ కనిపించింది. ఇక ఈ పోస్టుకు ఆయన 'భద్రకాళి ఆఫీస్' అనే క్యాప్షన్ జత చేశారు. ప్రస్తుతం సందీప్ రెడ్డి వంగా పోస్టు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. దీంతో ఈ పోస్టును షేర్ చేస్తూ మెగాభిమానులు తెగ వైరల్ చేస్తున్నారు. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో ఒక సినిమా వస్తే చూడాలని ఉందంటూ కామెంట్ చేస్తున్నారు. కాగా, సందీప్ రెడ్డి వంగా ప్రస్తుతం రెబల్ స్టార్ ప్రభాస్‌తో స్పిరిట్ మూవీ కోసం సిద్ధమవుతున్నారు. త్వరలోనే ఈ చిత్రం షూటింగ్ మొదలు కానుందని సమాచారం. మరోవైపు చిరంజీవి కూడా వరుస సినిమాలు చేస్తున్నారు. ప్రస్తుతం 'విశ్వంభర'తో బిజీగా ఉన్నారు. ఆ తర్వాత శ్రీకాంత్ ఓదెలతో మరో మూవీ చేయనున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టుపై అధికారిక ప్రకటన కూడా వచ్చింది. దీని తర్వాత అనిల్ రావిపూడితో చిరు సినిమా చేస్తారని టాక్.

# శర్వా కోసం సీనియర్ హీరో.. సాలీడ్ రెమ్యునరేషన్!






టాలీవుడ్ యంగ్ హీరో శర్వానంద్ వరుస సినిమాల్లో నటిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా డైరెక్టర్ అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో ఓ మూవీ చేస్తున్నారు. లూజర్ సిరీస్ తో మంచి గుర్తింపు సంపాదించుకున్న అభిలాష్.. ఇంట్రెస్టింగ్ స్టోరీతో రేసింగ్ బ్యాక్ డ్రాప్ తో శర్వానంద్ మూవీ రూపొందిస్తున్నట్లు ఇప్పటికే క్లారిటీ వచ్చేసింది. టైటిల్ ను జానీ అని ఫిక్స్ చేసినట్లు కొద్దిరోజులుగా టాక్ వినిపిస్తుండగా.. త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారని తెలుస్తోంది. మాళవికా నాయర్ హీరోయన్ గా నటిస్తుండగా.. ప్రెస్టీయస్ బ్యానర్ యూవీ క్రియేషన్స్ గ్రాండ్ గా నిర్మిస్తోంది. ఇప్పటికే ఆ బ్యానర్ పై శర్వా.. రన్ రాజా రన్, ఎక్స్ ప్రెస్ రాజా, మహానుభావుడు వంటి చిత్రాలు చేశారు. అయితే శర్వా-అభిలాష్ కాంబోలో వస్తున్న సినిమాలో సీనియర్ నటుడు రాజశేఖర్ నటిస్తున్నట్లు ఎప్పటి నుంచో ప్రచారం జరుగుతోంది. పవర్ ఫుల్ పాత్రలో ఆయన నటిస్తున్నారని, ఇప్పటికే షూటింగ్ లో కూడా పాల్గొన్నట్లు కొద్ది రోజుల క్రితం టాక్ వినిపించింది. రాజశేఖర్ ఇమేజ్ కు తగ్గట్టు పాత్రను డైరెక్టర్ మలిచినట్లు తెలుస్తోంది.
సినిమాలో శర్వానంద్ తండ్రి రోల్ లో రాజశేఖర్ కనిపించనున్నట్లు సమాచారం. స్టైలిష్ గా రోల్ ఉండనుందని టాక్. అయితే తన పాత్రకు గాను ఆయన భారీ పారితోషికం అందుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. దాదాపు 3 కోట్ల రేంజ్ లో రెమ్యునరేషన్ సొంతం చేసుకున్నారని టాక్ వస్తోంది. ఆ పాత్రకు కూడా ఆయన తక్కువ డేస్ లో షూటింగ్ లో పాల్గొంటున్నట్లు టాక్.- అయితే ఫామ్ లో లేకపోయినా కూడా రాజశేఖర్ కు సాలిడ్ రెమ్యునరేషన్ అందిందని చెప్పాలి. సోలోగా అనేక సినిమాలు చేసిన ఆయన.. హిట్ అందుకుని చాలా కాలం అయింది. గోరింటాకు తర్వాత ఆయన విజయం సొంతం చేసుకున్నట్లు దాఖలాలు లేవు. వివిధ సినిమాల్లో లీడ్ రోల్స్ పోషించినా.. మెప్పించలేకపోయారు. ఆమధ్య శేఖర్ మూవీతో వచ్చి సక్సెస్ అందుకుంటారని అంతా అంచనా వేశారు. కానీ మూవీ కూడా తీవ్రంగా నిరాశపరిచింది. గత ఏడాది నితిన్ ఎక్స్ ట్రా ఆర్డినరీ మూవీలో నటించినా.. ఆ సినిమా కూడా ఫ్లాప్ గా మారిన విషయం తెలిసిందే. ఇప్పుడు శర్వానంద్ మూవీలో కీలక పాత్ర పోషిస్తున్న ఆయన.. ఎలాంటి హిట్ అందుకుంటారో వేచి చూడాలి.

# జీక్యూ ఇండియా మ్యాగజైన్ కవర్ పేజీపై సామ్ ది రూలర్




సమంత రూత్ ప్రభు.. ది స్టన్నర్ .. రెబల్ లేడీ కా బాప్.. ఆ బాడీ లాంగ్వేజ్ లో బాస్ వైబ్స్ చూశాక యూత్ ఇలాంటి కాంప్లిమెంట్లతో విరుచుకుపడుతున్నారు. హాలీవుడ్ బాలీవుడ్ టాలీవుడ్ సరిహద్దులే లేవ్ ఇప్పుడు. అన్ని హద్దులు చెరిగిపోయాక అందుకు తగ్గట్టే ఇప్పుడు స్టార్లు మారాల్సిన సన్నివేశం కనిపిస్తోంది. లైమ్ లైట్ లో నిలబడాలంటే ప్రతిసారీ ఏదో ఒక యూనిక్ లుక్ తో అభిమానుల ముందుకు రావాలి. దానికోసం సాహసోపేతమైన ఫ్యాషన్ సెన్స్ ని , స్టైల్ కంటెంట్ ని అడాప్ట్ చేసుకోవాలి. ఇలాంటి విషయాల్లో టాలీవుడ్ క్వీన్ సమంత ఎప్పుడూ ముందుంటుంది. బాలీవుడ్ క్వీన్ కంగన, అనుష్క శర్మ, సోనమ్ కపూర్ వంటి సీనియర్ ఫ్యాషన్ ఐకన్స్ స్టైలింగ్ అండ్ సెన్స్ పరంగా అసాధారణ ప్రయోగాలు చేసారు. వీళ్ల బాటలోనే సమంత టాలీవుడ్ లో తనకంటూ ఓ యూనిక్ స్టైల్, ఫ్యాషన్ సెన్స్ ఉన్నాయని నిరూపించారు. సౌత్ ఫ్యాషనిస్టాగా ఇప్పటికే నిరూపించిన సమంత ఇప్పుడు కొత్త లుక్ తో హృదయాలను కొల్లగొడుతోంది. ప్రఖ్యాత జీక్యూ ఇండియా మ్యాగజైన్ కవర్ పేజీపై సమంత కొత్త లుక్ ఇప్పుడు యువతరంలో హాట్ టాపిక్ గా మారింది. సమంత బాస్ లేడీ వైబ్స్ ని మించి రెబలియన్ యాటిట్యూడ్ ని ఈ ఫోటోషూట్ ఎలివేట్ చేసింది.హాలీవుడ్ క్వీన్స్ మర్లిన్ మన్రో, ఎలిజబెత్ టేలర్ లోని ప్రయోగాత్మకత ఇప్పుడు సమంతలోకి ప్రవహించింది అంటే అది ఏమంత అతిశయోక్తి కాదు. తన కెరీర్ ఎంపికలు, ఛాయిస్‌లకు అనుగుణంగా తన రూపురేఖల్ని కూడా మార్చుకునేందుకు సమంత చేస్తున్న ఈ ప్రయత్నం కచ్చితంగా అడ్వాన్స్ డ్ థింకింగ్ అని అంగీకరించాలి. సామ్ ఎంపిక చేసుకున్న యూనిక్ హెయిర్ స్టైల్ యూత్ కి స్ఫూర్తిగా మారుతుంది. చాలా మంది నా పాత్రలతో సంబంధం కలిగి ఉంటారు.. ఎందుకంటే వారు నాలో తమలో ఒక భాగాన్ని చూస్తారు%--% అంటూ జీక్యూతో ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించింది సమంత.

# ఐటి కార్యాలయానికి దిల్ రాజు



ఎఫ్ డిసి చైర్మెన్, నిర్మాత దిల్ రాజు ఐటి కార్యాలయానికి వెళ్లారు. గత వారం దిల్ రాజు ఇంట్లో నాలుగు రోజుల పాటు ఐటి అధికారులు సోదాలు నిర్వహించారు. సోదాల అనంతరం వ్యాపారాలకు సంబంధించిన వివరాలు తీసుకరావాలని దిల్ రాజుకు నోటీసులు పంపారు. సినిమాల నిర్మాణం, ఎగ్జిబిషన్ లాభాల వ్యవహారంపై ఐటి అధికారుల ఆరా తీశారు. జనవరి 21న శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, మైత్రి మూవీ మేకర్స్, మ్యాంగో మీడియా సంస్థల్లో ఐటి అధికారులు సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఐటి సోదాలు అనేది కామన్.. అకౌంట్ బుక్స్ చెక్ చేసి స్టేట్‌మెంట్ తీసుకున్నారని, మా ఇంట్లో రూ.20 లక్షల లోపే డబ్బులు ఉన్నాయని టాలీవుడ్ ప్రముఖ నిర్మాత దిల్ రాజు గతంలో తెలిపిన విషయం విధితమే.